


విద్యుత్ వెలుగుల్లో శింగరకొండ (ఇన్‌సెట్‌లో) ఆంజనేయుడి వేషధారణలో కళాకారుడు

శింగరకొండ దేదీప్యమానం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని శింగరకొండ తిరునాళ్ల సోమవారం కనుల పండువగా జరిగింది. లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి కొలువైన ఈ క్షేత్రం విద్యుత్ వెలుగులతో దేదీప్యమానంగా మారింది. గతంలో పెద్దసంఖ్యలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మాత్రం ఎన్నికల కోడ్ కారణంగా ఒకే ఒక్కటి ఏర్పాటైంది. దీంతో భక్తులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు.

-అద్దంకి



ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డినే పోటీచేయనున్నారు. ఆ మేరకు సోమవారం అధికారిక నిర్ణయం జరిగిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని పోటీచేయాలని మాగుంటకు సూచించగా అందుకు ఆయన అంగీకరించారు. ఇప్పటికే ప్రచారంలో ఉన్న ఆయన కుమారుడు రాఘవరెడ్డి కూడా పార్టీ సూచనలను గౌరవిస్తూ తన తండ్రి శ్రీనివాసులరెడ్డి పోటీలో ఉండబోతున్నారని ప్రకటించారు. అయితే దర్శి అసెంబ్లీ అభ్యర్థి ఎంపికలో టీడీపీ అధిష్ఠానం అనుసరిస్తున్న తడబాటు ధోరణిపై ఆ పార్టీ శ్రేణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.



వైసీపీని వీడి అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కంభం జడ్పీటీసీ, అర్థవీడు ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

బరిలో ఎంపీ మాగుంట

- ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి మళ్లీ పోటీ
- మాట్లాడి ఒప్పించిన టీడీపీ అధినేత చంద్రబాబు
- పార్టీ నిర్ణయాన్ని స్వాగతించిన రాఘవరెడ్డి
- దర్శిపై కొనసాగుతున్న సస్పెన్స్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వచ్చే ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరు ఖరారైంది. తన కుమారుడు రాఘవరెడ్డిని పోటీలో ఉంచబోతున్నట్లు ఏడాదిన్నర క్రితమే ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వివిధ కారణాలతో ఆయన వైసీపీకి రాజీనామా చేసిన రోజు, టీడీపీలో చేరిన రోజు కూడా తన కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. టీడీపీ నాయకత్వానికి ఆ మేరకు సమాచారం ఇచ్చిన తర్వాతే ఆయన రాఘవరెడ్డి పేరును ప్రకటించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఒంగోలు లోక్‌సభ పరిధిలోని టీడీపీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ సర్వే చేసింది. తొలుత రాఘవరెడ్డి అభ్యర్థిగా ఆ తర్వాత శ్రీనివాసులరెడ్డి అభ్యర్థిగా ప్రజాభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆపై బీజేపీతో సీట్ల ఒప్పందంపైన టీడీపీ ఒక అవగాహనకు రావటంతో అభ్యర్థుల ఎంపికపై తర్జనభర్జన పడ్డారు. అదేసమయంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు, తదనంతర పరిణామాలు చోటుచేసుకున్నాయి. వీటన్నింటికీ తోడు భవిష్యత్తులో కేంద్రంతో వివిధ అంశాలపై రాయబారాలు జరిపేందుకు లోక్‌సభ సభ్యులుగా పార్టీలో కొందరు సీనియర్లు, ఢిల్లీ రాజకీయాల్లో పట్టు ఉన్న వారు ఉంటే మంచిదని టీడీపీ భావించింది. ఇప్పటికే ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల్లో యువకులు, అందునా కొత్తవారు ఎక్కువగా ఉన్నారు. దీంతో చంద్రబాబు ప్రత్యేక అధ్యయనం చేసి శ్రీనివాసుల రెడ్డిని రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ మేరకు ఆదివారం సాయంత్రం చంద్రబాబు ఎంపీ మాగుంటకు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. అయితే తన కుమారుడు రాఘవరెడ్డిని రంగంలో దింపాలనేది కుటుంబ నిర్ణయమని మాగుంట చెప్పగా.. పార్టీ నిర్ణయం వారికి తెలిపి ఒప్పించాలని చంద్రబాబు సూచించారు. దీంతో ఆదివారం రాత్రి మిగిలిన కుటుంబ సభ్యులతో మాట్లాడిన మాగుంట ఈ పర్యాయం ఒంగోలు నుంచి తానే పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. ప్రచారంలో ఉన్న కుమారుడు పరిస్థితిని అర్థం చేసుకొని తన తండ్రి పోటీలో ఉంటారని ప్రకటించారు.

దర్శి ఒక్కటే పెండింగ్

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి ఎంపిక కూడా పూర్తికావడంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ కూటమి దర్శి అసెంబ్లీ అభ్యర్థిని మాత్రమే ప్రకటించాల్సి ఉంది. ఇక్కడ అభ్యర్థి ఎంపికపై జాప్యం జరగడం పట్ల నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తొలుత జనసేనకు సీటు కేటాయించడంతో గరికపాటి వెంకట్ వచ్చి పనిచేయడం ప్రారంభించారు. టీడీపీకి ఆ స్థానం దక్కడంతో టికెట్ ఆశించే వారి సంఖ్య పెరిగింది. కొంతకాలంగా అక్కడ పనిచేస్తున్న వెంకట్‌కే అవకాశం ఇవ్వాలని జనసేన నేత పవన్‌కల్యాణ్ చంద్రబాబుకు సిఫార్సు చేసినట్లు తెలిసింది. దీనికి తోడు టీడీపీలో ఉన్న వారితోపాటు వైసీపీలో ఉన్న మాజీ మంత్రి పేరు పరిశీలనకు వచ్చింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అనుచరులు మాత్రం ఆయన పార్టీలో చేరినట్లే, టికెట్ వచ్చినట్లే ప్రచారం చేస్తున్నారు. కాగా ఆయన గాని ఆయన కుటుంబ సభ్యులు కానీ నోరు మెదపకపోవడం విశేషం. టీడీపీ యువనేత నారా లోకేష్ కూడా పార్టీ మారిన వారు వద్దని కొత్తవారు కావాలనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో ఫోన్ సర్వే నిర్వహించిన టీడీపీ తాజాగా గరికపాటి వెంకట్, గొట్టిపాటి లక్ష్మి, శిద్దా రాఘవరావు, హర్షిణీ రవికుమార్‌లపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. వైసీపీ అభ్యర్థి ఆర్థికంగా బలవంతుడు కావడంతో ఆ విషయాన్ని, జనసేన సిఫార్సుపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తేల్చుకోలేక అధిష్ఠానం సతమతమవుతున్నట్లు తెలిసింది. అభ్యర్థి ఎంపికలో టీడీపీ అధిష్ఠానం అనుసరిస్తున్న తాత్సారంపై ఆపార్టీ జిల్లా నాయకులు, నియోజకవర్గ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బెదిరేది లేదు!

- గిద్దలూరులో టీడీపీలోకి భారీగా పెరిగిన వలసలు
- కంభం, అర్థవీడు, రాచర్ల మండలాల్లో చేరికలు
- ఫలించని వైసీపీ నేతల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ బెదిరింపు రాజకీయాల వ్యూహం బెడిసికొడుతోంది. అందుకు గిద్దలూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలే సాక్ష్యంగా నిలిచాయి. తెలుగుదేశం పార్టీలోకి వలసలకు బ్రేక్ వేసేందుకు హత్యా రాజకీయాలకు వైసీపీ తెరలేపిన విషయం తెలిసిందే. అయినా అక్కడ వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు తగ్గకపోగా రెట్టింపయ్యాయి. సోమవారం రెండు మండలాల్లో, ఆదివారం ఒక మండలంలో వైసీపీకి ముఖ్యులు, ప్రజా ప్రతినిధులు, కొన్ని సామాజికవర్గాలకు చెందిన ప్రముఖులు పోలోమని టీడీపీలో చేరారు. వారందరూ టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి సమక్షంలో సైకిలెక్కారు. ఏడాదిన్నర నుంచి నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వైసీపీ అభ్యర్థి ఎంపికలో తకరారు తర్వాత అవి మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో వలసల నివారణకు బెదిరింపు రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. పరమేశ్వరనగర్‌లో ఏడాదిన్నర క్రితం టీడీపీలో చేరిన గిరిజన యువకుడు మునయ్యను హత్య చేశారు. దీంతో టీడీపీలోకి వలసలు రాకుండా బ్రేక్ పడుతుందని చాలామంది భావించారు. కానీ అనూహ్యంగా వలసలు పెరిగాయి. సోమవారం కంభం, అర్థవీడు మండలాల్లో యాదవ, గాండ్ల, కాపు, ఆర్యవైశ్య సామాజికవర్గాల నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. యాదవ సామాజికవర్గానికి చెందిన కంభం జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఆమె భర్త, కందులాపురం మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసీపీలోని వారి అనుచరులతోపాటు యాదవ సామాజికవర్గంలోని వారి బంధుగణం, ఇతర ప్రముఖులు కూడా అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కంభంలో ఆర్యవైశ్య సామాజికవర్గంలో కీలకపాత్ర పోషించే ప్రముఖులు కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పారు. బిజ్జాల కిషోర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల చేరిక జరిగింది. ఇదేమండలంలోని తురిమెళ్ల సర్పంచ్ సుభద్ర, వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారితోపాటు గ్రామంలోని గాండ్ల సామాజికవర్గానికి చెందిన వారు టీడీపీలో చేరారు. ఇక అర్థవీడు ఎంపీపీ ఎం.వెంకట్రావుతోపాటు పెద్దసంఖ్యలో ఆయన అనుచరులు, కాపు సామాజికవర్గాల వారు టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. దివంగత టీడీపీ నేత శ్రీరాములరెడ్డి అల్లుడైన వెంకట్రావు ఎంపీపీగా వైసీపీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. మండలంలో కాపు సామాజికవర్గంలోని వివిధ తెగల వారిని సమన్వయం చేస్తూ ముందుకు నడుపుతున్నారు. ఈ మండలంలోని మాగుటూరు సర్పంచ్ ఈశ్వరీబాయ్, జయరామ్‌నాయక్‌తోపాటు గిరిజన కుటుంబాల వారు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. అలాగే మావోయిస్ట్‌గా ఆ ప్రాంత ప్రజలకు తెలిసి, ఆ తర్వాత ప్రభుత్వానికి లొంగిపోయి, ప్రస్తుతం వైసీపీలో ఉన్న పాండురంగారెడ్డి అలియాస్ సాగర్ అనుచరులతో కలిసి టీడీపీలోకి చేరి అశోక్‌రెడ్డికి మద్దతు పలికారు. ఆదివారం రాత్రి పొద్దుపోయాక రాచర్ల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు లలితకుమారితోపాటు చోళ్లవీడు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, ఆ గ్రామంలోని మూడు వార్డుల సభ్యులు వైసీపీ నుంచి అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరూ కాపు సామాజికవర్గానికి చెందిన వారు. గిరిజన యువకుడు మునయ్య హత్య అనంతరం పార్టీ, ప్రభుత్వ పదవులను వదులుకుని ఆయా సామాజికవర్గాల ప్రముఖులు ఇలా వైసీపీ నుంచి టీడీపీలో చేరుతుండడంతో హత్యా రాజకీయాలకు బెదరబోమనే సంకేతాన్ని వారిచ్చినట్లు ప్రస్ఫుటమవుతోంది.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్ మార్పు

- 31న మార్కాపురంలో సభకే పరిమితం



ఒంగోలు, మార్చి 25 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన షెడ్యూల్‌లో మార్పు జరిగింది. తొలుత ఈనెల 31న జిల్లాలోని మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలలో ప్రజాగళం పేరుతో ఆయన పర్యటించేలా నిర్ణయించారు. అయితే తాజాగా ఆ షెడ్యూల్‌ను మార్చారు. ప్రస్తుతం జిల్లా నేతలకు అధిష్ఠానం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 31న చంద్రబాబు కార్యక్రమం మార్కాపురం వరకే పరిమితం కానుంది. ఆరోజు ఉదయం నెల్లూరు జిల్లా కావలిలో జరిగే సభలో పాల్గొనే చంద్రబాబు అనంతరం హెలికాప్టర్‌లో మార్కాపురం చేరుకొని అక్కడ ఏర్పాటు చేసే సభలో ప్రసంగిస్తారు. అనంతరం బాపట్ల జిల్లాకు వెళ్తారు. ఆ జిల్లాలోని రేపల్లె, బాపట్లలో జరిగే సభల్లో పాల్గొంటారు.



ఖాళీ బిందెలతో కేజీ రోడ్డులో నిరసన తెలుపుతున్న ఐనముక్కల ఎస్సీ కాలనీ వాసులు

నీటి కోసం నిరసన

- ఐనముక్కల ఎస్సీ కాలనీవాసుల రాస్తారోకో
- కేజీ రోడ్డులో గంటసేపు నిలిచిన వాహన రాకపోకలు

పెద్దదోర్నాల, మార్చి 25 : నీటి సమస్యను పరిష్కరించాలంటూ మండలంలోని ఐనముక్కుల గ్రామ ఎస్సీకాలనీ వాసులు సోమవారం ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో కర్నూలు-గుంటూరు జాతీయరహదారిపై నిరసన తెలిపారు. దీంతో గంటపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అంకమరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ట్యాంకర్‌తో ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు మొక్కుబడిగా ఇస్తే ఎలా సరిపోతాయని గగ్గోలుపెట్టారు. దీంతో ఎస్ఐ పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో విషయం చెప్పారు. గ్రామ సర్పంచి హారిక భర్త కృపాకర్ వచ్చి కాలనీవాసులతో మాట్లాడారు. ప్రస్తుతం ట్యాంకరుతో నీటిని సరఫరా చేస్తామని, రెండు రోజుల్లో బోరు బావిని తవ్వించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వైసీపీకి ధరణికోట గుడ్‌బై

- నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికీ రాజీనామా

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 25 : వైసీపీకి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ధరణికోట లక్ష్మీనారాయణ సోమవారం రాజీనామా చేశారు. రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రిజర్వేషన్లకు ముప్పు పొంచి ఉందన్నారు. అందులో భాగంగా ప్రజాసంఘాలు, బహుజన భావజాలం ఉన్న పార్టీలతో కలిసి పనిచేయాలన్న ఉద్దేశంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

మద్దిశెట్టి వర్గీయుడిపై దాడి

- బూచేపల్లి అనుయాయులు దారికాచి కొట్టారు..!
- తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చేరిన బాధితుడు
- కేసు నమోదు చేయకుండా ముండ్లమూరు ఎస్ఐ నిర్లక్ష్యం

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 25 : ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వర్గీయునిపై మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వర్గీయులు దాడి చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి ముండ్లమూరులో చోటు చేసుకుంది. బాధితుడు పసుపుగల్లుకు చెందిన బిజ్జం శ్రీనివాసులరెడ్డి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. పసుపుగల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తనపై బూచేపల్లి వర్గీయులు దారికాచి దాడి చేసినట్లు బాధితుడు శ్రీనివాసులరెడ్డి వాపోయారు. గతనెల 11వ తేదీన ఉల్లగల్లు వద్ద తాను ట్రాక్టర్ నడుపుతూ వెళుతుండగా తప్పెట నాగభూషణం అనే వ్యక్తికి తగిలిందన్నారు అయితే అందుకు సంబంధించి నష్టపరిహారంగా తన వద్ద రూ.60వేలు, బైక్, సెల్‌ఫోన్ కూడా తీసుకున్నారని బాధితుడు తెలిపారు. కాగా తన వద్ద నుంచి తీసుకున్న బైక్, సెల్ ఇస్తామని ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ నమ్మకంగా పిలిపించగా ముండ్లమూరు బయల్దేరానని పేర్కొన్నారు. అయితే దారికాచి బూచేపల్లి వర్గానికి చెందిన రెడ్డినగర్‌కు చెందిన రమణారెడ్డి, ఉల్లగల్లుకు చెందిన గొంది వెంకట అప్పిరెడ్డి, జనకాల పిచ్చయ్య, తప్పెట నాగరాజు, కత్తి నాగరాజులు దాడిచేశారని వాపోయారు. అలాగే వెంటపడి చంపబోయారని తెలిపారు. ఇదేవిషయమై తాను ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేం దుకు వెళ్లగా అక్కడి ఎస్ఐ ఆంజనేయులు తీసుకోకపోగా తనను బెదిరింపులకు గురిచేసి, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారని తెలిపారు. అంతేకాకుండా దాడికి ఎస్ఐ కూడా సహకరించారని ఆరోపించారు. ఆదివారం జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన తాను దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం చేరగా, రాత్రి వరకు అక్కడే వైద్యులు చికిత్స చేశారన్నారు. తీవ్రగాయాలైనందున మెరుగైన వైద్యం కోసం సోమవారం ఒంగోలు రిమ్స్‌కు పంపారన్నారు. ఇప్పటికీ తనను అక్కడి నేతలు బెదిరిస్తున్నారని, తనపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని ఆయన కోరారు. కాగా బాధితుడికి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించనున్నారు.



బాధితుడు శ్రీనివాసుల రెడ్డి



రేషన్ బియ్యాన్ని కూలీలతో లారీలోకి ఎక్కిస్తున్న అధికారులు

రైసు మిల్లులో రేషన్ బియ్యం

- రాజుపాలెంలో 756 బస్తాలు పట్టివేత

త్రిపురాంతకం, మార్చి 25 : మండలంలోని రాజుపాలెంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర రైస్‌మిల్లుపై ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జితేంద్ర, వీఆర్వోలు ఖాసింపీరా, శివలింగయ్య దాడి చేశారు. అక్కడ 756 బస్తాల రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని ఎర్రగొండపాలెం గోడౌన్‌కు తరలించారు. మిల్లు యజమాని శ్రీనివాస్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. కాగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో రేషన్ బియ్యం వ్యాపార సామ్రాజ్యాన్ని వైసీపీ నాయకుడు నడుపుతున్నట్లు తెలుస్తోంది.





హోలీ.. జాలీ..

హోలీ పండుగను ప్రజలు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో యువతీయువకులు, చిన్నారులు, ఉత్తరాది కుటుంబాల వారు రంగులు చల్లుకుని ఆట పాటలతో సందడి చేశారు. ఈసందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజ నిర్వహించారు. నగరంలో నివసిస్తున్న రాజస్థాన్, బిహార్, పశ్చిమబెంగాల్ మొదలైన రాష్ట్రాలకు చెందిన పలు కుటుంబాల వారు స్నేహితులతో కలిసి హోలీ వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

- ఒంగోలు కల్చరల్

ఎస్పీ కార్యాలయానికి హోంగార్డు సరెండర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

త్రిపురాంతకం, మార్చి 25 : వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హోంగార్డు మందా కొండారెడ్డిని ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు త్రిపురాంతకం సీఐ ఎస్. సుబ్బారావు తెలిపారు. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మందా కొండారెడ్డి ఇటీవల వైసీపీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు నిర్వహించిన ఆత్మీయ సమావేశం, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరిచయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి త్రిపురాంతకం సీఐ స్పందించారు. హోంగార్డుపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతోపాటు ఆయన్ను ఎస్పీ కార్యాలయానికి పంపినట్లు సీఐ చెప్పారు.



జనార్దన్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

టీడీపీలోకి భారీగా చేరికలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 25 : ఒంగోలు నగరంలోని పలువురు వైసీపీని వీడి, తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారు. ఇటీవల పార్టీలో చేరుతున్నవారితో ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొనగా, రోజు రోజుకు వైసీపీని వీడే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ మేరకు సోమవారం నగరంలోని 50వ డివిజన్‌కు చెందిన వైసీపీ వారు చేరగా, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే నగరంలోని 4వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. దీంతో తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహం మొదలైంది. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకముందు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హోలీ వేడుకలలో దామచర్ల ఉత్సాహంగా పాల్గొని, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

దామచర్ల ప్రత్యేక పూజలు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ సోమవారం నగరంలోని పలు దేవాయాల్లో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సంతపేటలోని శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఉత్సవాలలో పాల్గొని పూజలు చేయగా, 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్క్‌లో శ్రీరాధా మాధవ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్యను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నల్లూరి ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

● ఎన్ఆర్ఐ శేషయ్యకు ఘనసత్కారం

చీమకుర్తి,మార్చి25 : కరోనా కష్టకాలంలో నేనున్నానంటూ తన సొంతూరు కూనంనేని వారిపాలెంతో పాటు చీమకుర్తి పట్టణం,మండలంలోని పలుగ్రామాల్లో భారీస్థాయిలో నల్లూరి ఫౌండేషన్ ద్వారా బియ్యం,సరుకులు పంపిణీ చేసి ఆపన్నహస్తం అందించిన నల్‌సాఫ్ట్ సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత నల్లూరి వెంకటశేషయ్య ఆరేళ్ల తర్వాత స్వగ్రామమైన కేవీ పాలెంకు వచ్చారు.తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు పెద్దఎత్తున సోమవారం శేషయ్యను కలిసి ధన్యవాదాలు తెలిపారు. గజమాలతో శేషయ్య,నల్లూరి సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటంతోపాటు వైద్యసేవలకు అయిన ఖర్చును నల్లూరి ఫౌండేషన్ ద్వారా భరించటం ఆదర్శనీయం అని టీడీపీ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య తెలిపారు. గ్రామంలో చెరువులను పునరుద్ధరించి రైతులకు బాసటగా నిలవటంతోపాటు బడుగు,బలహీనవర్గాల విద్యార్థుల ఉన్నత విద్యకు బాటలు వేసిన ఘనత నల్లూరి వెంకటశేషయ్యకు దక్కిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కందిమళ్ల గంగాధరరావు, మాజీ కౌన్సిలర్ గొల్లపూడి కోటేశ్వరరావు, సూరంపల్లి హనుమంతరావు, ముప్పూరి చలమయ్య,షేక్ మోమిన్, గంగుల శివపార్వతి, అమానుల్లా, అబుసలేర్,గోరంట్ల చెన్నయ్య, పరాల శ్రీను, నలపాటి కొండయ్య, సురేష్,వెంకాయమ్మ, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నిస్వార్థ సేవకుడు బాపనయ్య

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు శాసనమండలి సభ్యునిగా పనిచేసిన గుంటూరు బాపనయ్య నిస్వార్థ ప్రజా నాయకుడని కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివంగత బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో అంజయ్య మాట్లాడుతూ సమాజంలో కొనసాగుతున్న అమానుషమైన అంటరానితనం, అవమానాలు ఆయనను పోరాటయోధుడిగా మలిచాయన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కంకణాల వెంకటేశర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, జి. శ్రీనివాసులు, బి .రఘరాం, వి. బాలకోటయ్య, కంకణాల రమాదేవి, సీహెచ్‌వినోద్, కేఎఫ్‌బాబు, ఎస్‌డీ షమ్మి, ఏ బ్రహ్మయ్య, రవికుమార్ తదితరులు ఉన్నారు.



వీడ్కోలు వేడుకల్లో పాల్గొన్న రైజ్ విద్యార్థులు

రైజ్‌లో ఘనంగా వీడ్కోలు వేడుకలు

ఒంగోలు(విద్య), మార్చి 25 : స్థానిక రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో సోమవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. సీఎస్ఈ, సీఎస్‌సీ-డీఎస్, ఈసీఈ విభాగాలకు చెందిన ఫైనల్ ఇయర్ ఉత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు తమ సీనియర్స్ అయిన నాల్గవ సంవత్సరం విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన తీరు అలరించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కే వీసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాల్గవ సంవత్సరం విద్యార్థులకు తమ కళాశాలలో ఇప్పటికే 75శాతం విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించినట్లు తెలిపారు. తృతీయ సంవత్సరంలో ఉన్న విద్యార్థులకు కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు ఎస్‌వీ రకుమార్, ఐజాక్ పాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

కూనం కుటుంబమంతా వైసీపీ సభ్యులే

విలేకర్ల సమావేశంలో బీఎన్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్ విజయ్‌కుమార్, నేతలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 25 : విశాఖలో పట్టుబడిన కొకైన్ వ్యహారంలో కీలకమైన కూనం పూర్ణ చంద్రరావు వైసీపీ సీనియర్ నాయకుడిగా ఉండగా, ఆయన కుటుంబమంతా వైసీపీ వ్యవస్థాపక సభ్యులే అని సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి బీఎన్. విజయ్ కుమార్ అన్నారు. సోమారం సంతనూతలపాడు నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ మొదటి స్థానంలో ఉంటే జగన్ రెడ్డి హయాంలో డ్రగ్స్ రవాణాలో నెం.1 స్థానానికి చేర్చాడని విమర్శించారు. వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం వైసీపీ సీనియర్ నేత అని, ఇతనికి విజయసాయి రెడ్డితో సంబంధాలు ఉన్నాయని అన్నారు. విశాఖలో పట్టుబడిన కంటైనర్‌లో వివిధ రకాల మత్తు పదార్థాలు ఉన్నాయని సీబీఐ తన నివేదికలో పేర్కొందన్నారు. గతంలో విజయవాడలోని ఆశీ ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ. 21 వేల కోట్లు విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇపుడు ఏకంగా డ్రై ఈస్ట్‌తో కలిపి రూ. 50 వేల కోట్ల విలువైన 25వేల కిలోల మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంపెట్‌మిన్ వంటి మత్తు పదార్థాలు దొరికాయన్నారు. బ్రెజిల్ నుంచి మత్తు పదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసే జగన్ రెడ్డి తన అధికారులను పంపారా ? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం, మాఫియాతో ఇన్నాళ్ళు ప్రజల ఇళ్లు, ఒళ్ళు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలో ఉన్నాయని ఆయన విమర్శించారు. వైసీపీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై నిందలు వేయడం దుర్మార్గమన్నారు. మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని, గొల్లపూడి సుబ్బారావు, సెక్రటరీ కాకర్ల లక్ష్మి ప్రసాద్, రావుల సుబ్బారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కంకణాల గోపి, అట్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ కరప్రతాలు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

వైసీపీ దౌర్జన్య పాలన పోవాలి

సంతనూతలపాడు, మార్చి 25: రాష్ట్రంలో వైసీపీ దౌర్జన్యపాలన పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని మైనంపాడులో జరిగిన బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత లాగే నాయకులు నియంతల్లా వ్యవహరించడం, ప్రజల్లో సైతం వైసీపీ పట్ల తీవ్ర అసహనంతో ఉన్నారని అన్నారు. ప్రజావ్యతిరేక పాలన ఉంటే ప్రభుత్వాలు నిలబడవని అన్నారు. ప్రజలు చంద్రబాబు గెలుపుకోసం చూస్తున్నారని, ఆయన అందించే సంక్షేమపాలన కోసం ఆశతో ఉన్నారని, వారి ఆశలన్నీ నెరవేరే సమయం కొద్దిరోజుల్లోనే ఉందని ఆ అన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కందుకూరిబాబు, మండలపార్టీ అధక్షుడు మద్దినేని హరిబాబు, టీడీపీ రాష్ట్ర సెక్రటరి అడకాస్వాములు, నాయకులు ఆళ్ల సుబ్బారావు, స్థానిక గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళ, బుధవారాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. బుధవారం ఉదయం 8గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

వేలం కేంద్రంలో స్వచ్ఛభారత్

కొండపి, మార్చి 25 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం స్వచ్ఛభారత్-3 కార్యక్రమం నిర్వహించారు. వేలం ముగిశాక సూపరింటెండెంట్ జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది కేంద్రం ఆవరణలోని వ్యర్థాలు, కార్యాలయంలోని గదుల్లోని చెత్త, పనికిరాని పాత రికార్డులను తొలగించారు. కార్యక్రమంలో ఎస్‌జీవో టి.సాయికుమార్, క్షేత్ర సహాయకుడు మోతీలాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులలు

ఒంగోలు (కల్చరల్), మార్చి 25: పౌర్ణమి సందర్భంగా సోమవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత ఘనంగా జరిగింది. స్థానిక జయరాం హాలు దగ్గర ఉన్న గోశాల వద్ద ముందుగా పూజలు నిర్వహించి అనంతరం కోర్టు సెంటర్, కేశవస్వామిపేట, శర్మా కళాశాల, గద్దలగుంట, కొణిజేడు బస్టాండు, రాజాపానగల్ రోడ్డు మీదుగా శ్రీగిరికి భక్తులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారు అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తులు గోవింద నామ స్మరణ చేశారు. అదేవిధంగా మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో గిరిప్రదక్షిణ కమిటీ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవ రెడ్డి, చిలకపాటి రంగారావు, రాధారమణ గుప్తా జంధ్యం పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా సామూహిక సత్య నారాయణ వ్రతాలు

స్థానిక కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీలక్ష్మి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దంపతులు పెద్దసంఖ్యలో పాల్గొని వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు రమానాధాచార్యులు, కె.వి.ఎల్.శర్మావధాని, నాగార్జున దేవ్‌లు ముందుగా విష్వక్సేన పూజ, కలశారాధన, రమా వసుంధర సహిత సత్యనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకం మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అమ్మవారికి అష్టోత్తర శత నామ పూజ, కథాశ్రవణం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, సిబ్బంది పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఒంగోలు ఎంపీగా మాగుంట పోటీ

● పత్రికా ప్రకటనలో రాఘవరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : ఒంగోలు లోక్‌సభ ఎన్నికల్లో తన తండ్రి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పోటీ చేస్తారని యువ పారిశ్రామికవేత్త, మాగుంట తనయుడు రాఘవరెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. తన తండ్రి మాగుంట ఒక సీనియర్ ఎంపీగా ఉండటం వల్ల రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతోపాటు కేంద్ర పథకాలు రాష్ట్రంలో సమర్థవంతంగా నిర్వహిస్తారనే అభిప్రాయంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ పర్యాయం ఒంగోలు పార్లమెంట్‌కు శ్రీనివాసులరెడ్డి పోటీ చేయిస్తే మంచి ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయం తెలియజేసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందువల్ల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులు, ప్రజలు, మాగుంట అభిమానులు మా తండ్రి శ్రీనివాసులరెడ్డి విజయానికి కృషిచేయాలని కోరారు. ఎప్పటిలాగే తాను యువతకు, నాయకులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఒంగోలు పార్లమెంట్ వినూత్న అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజాసేవలో మాగుంట కుటుంబం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందని రాఘవరెడ్డి తెలిపారు.

పృథులగిరీశుని దర్శించుకున్న దామచర్ల సత్య



స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న దామచర్ల సత్య

మర్రిపూడి, మార్చి 25 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరిలోని లక్ష్మీనరసింహుడిని సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆలయ అర్చకులు నారాయణం మారుతీ ఆచార్యులు శేష వస్త్రంతో సత్కరించారు. సత్య వెంట టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రేగుల వీరనారాయణ, గొంటు హనుమారెడ్డి, టీడీపీ నాయకులు వై.వెంకటరెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, ఉప్పు రమణయ్య, మండె మల్లికార్జున, పొదిలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మదినోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అయ్యప్పస్వామి

కొండపి, మార్చి 25 : హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు స్థానిక ఆలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

కొండపి పంచాయతీలోని ముక్కోడిపాలెంలో గ్రామానికి చెందిన నాగార్పమ్మ మినరల్ వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో కూలింగ్ నీళ్ల చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వేసవి పూర్తయ్యే వరకూ ప్రజలకు నీటిని ఇస్తామన్నారు. ప్లాంట్ నిర్వాహకుడు ముక్కు ప్రసాద్ తెలిపారు.

పల్లామల్లిలో హోలి వేడుకలు

చీమకుర్తి, మార్చి 25 : హోలీ వేడుకలను సోమవారం పల్లామల్లి గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.డెయిరీ పరిశ్రమ ఈ ప్రాంతంలో విస్తరించటంతో బీహార్ రాష్ట్రానికి చెందిన యువకులు పెద్దఎత్తున ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నా రు. వారందరూ హోలీని ఉత్సాహంగా జరుపుకున్నారు. అలాగే గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన యువకులు హోలీ వేడుకలు చేసుకున్నారు.



కె.ఉప్పలపాడు గ్రామంలో స్థానికులకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై కృష్ణబాజీబాబు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

కొండపి, మార్చి 25 : ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కొండపి ఎస్సై కృష్ణబాజీబాబు అన్నారు. ఎవరు శాంతిభద్రతలకు విఘాతం కల్గించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా కూడి రాజకీయ సమావేశాలు, చర్చలు, వాదోపవాదాలు చేసుకోవడం నిషేధమని ఆయన తెలిపారు.



కాలిపోతున్న బ్యారన్

బ్యారన్ దగ్ధం

జరుగుమల్లి (కొండపి), మార్చి 25 : పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ బ్యారన్ దగ్ధమైంది. ఈ సంఘటన మండంలోని పచ్చవలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలోని ముప్పరాజు మాలకొండయ్య అనే రైతుకు చెందిన బ్యారన్‌లో పొగాకు కర్రజారి మొద్దుగొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. క్యూరింగ్‌లో ఉన్న పొగాకు, కర్రలు, టైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కొండపి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.4.50లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో న్యాయం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే యాదవులకు పదవులు దక్కాయని ఆపార్టీ యాదవసామాజిక వర్గానికి చెందిన నాయకులు స్పష్టం చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి యాదవులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు కఠారి శంకర్, కటారి రామచంద్రరావు, మట్టె రాఘవ, బొట్లా సుబ్బారావు, యనమల నాగరాజు, జడా వెంకటేష్, గురువయ్య, చల్లా తిరుమలరావు, చావలి శివ, విశ్వనాథం, కటారి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అవీ..ఇవీ..

కార్మికుల ఆత్మబంధువు గంగిశెట్టి



గంగిశెట్టి కోటయ్యకు నివాళులు అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : కార్మికుల కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి గంగిశెట్టికోటయ్య అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అన్నారు స్థానిక అద్దంకి బస్టాండులోని ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సోమవారం కోటయ్య ద్వితీయ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సుమారు 30కిపైగా కార్మిక సంఘాలు ఏర్పాటు చేసి కార్మికులకు ఆత్మబంధువు అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ సర్దార్, పీవీఆర్ చౌదరి, ఉప్పుటూరి ప్రకాశరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, కే ఆంజయ్య ఆనంద్, విశ్వనాథ్, గంగయ్య, కల్లూరి లక్ష్మయ్య, నరసింహారావు తదితరులు ఉన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ. 232

సంతనూతలపాడు, మార్చి 25: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు కందులూరు నుంచి 915 పొగాకు బేళ్లు రాగా 799 బేళ్లు అమ్ముడైనట్లు, 105 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.231లు పలకగా, కనిష్ఠ ధర రూ.220, సరాసరి ధర రూ.228.70 పలికినట్లు తెలిపారు. వేలంలో కొనుగోలుకు 20 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత జవాబు పత్రాల మూల్యాంకనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల రెండో విడత మూల్యాంకనం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత మూల్యాంకనం ముందుగా ఈనెల 28వతేదీ నుంచి నిర్వహించాల్సి ఉండగా రెండు రోజుల ముందుగానే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బాటని, జువాలజీ, కామర్స్ పేపర్ల వాల్యువేషన్ జరుగుతుందని తెలిపారు. మూల్యాంకానికి నియమితులైన లెక్చరర్లు మంగళవారం ఉదయం పది గంటలకు స్థానిక ఏకేవీకే జూనియర్ కాలేజీలో హాజరుకావాలన్నారు. జిల్లాలోని ప్రిన్సిపాళ్లందరూ వారి కాలేజీలోని బాటని, జువాలజీ, కామర్స్ అధ్యాపనులను స్పాట్ వాల్యువేషన్ కేంద్రానికి పంపించాలని కోరారు

మేయర్‌ను పరామర్శించిన రాఘవరెడ్డి



మేయర్ సుజాతను పరామర్శిస్తున్న ఎంపీ తనయుడు రాఘవరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాతను యువపారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి పరామర్శించారు.అనారోగ్యంతో స్థానిక ఆస్టర్ రమేష్ సంఘమిత్రలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాఘవరెడ్డి సోమవారం వైద్యశాలలో ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తాతా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఓపెన్ స్కూలు పరీక్షలు

ఒంగోలు(విద్య), మార్చి 24 : జిల్లాలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో పరీక్షల నిర్వహణ కోసం 18 స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేస్తున్నాయన్నారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే యాక్ట్ 25 ప్రకారం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓపెన్ స్కూలు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్‌కే అక్బర్ ఆలీ, ఎం. శ్రీనివాసరావులు కంభం, బేస్తవారిపేట, రావిపాడు, పొదిలిలోని ఓపెన్ స్కూలు సెంటర్లను తనిఖీ చేసి ఎలాంటి అవకతవకలు జరగలేదని నిర్ధారించారని డీఈవో సుభద్ర తెలిపారు.

శాస్త్రోక్తంగా గోమాత అంత్యక్రియలు



గోవు కలేబరాన్ని పూడ్చివేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు (కల్చరల్), మార్చి 25:స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని గోశాలలో గత కొన్ని సంవత్సరాలు ఉన్న గిరి జాతి గోవు మృతి చెందింది. దీంతో గోవు ఖనన కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత ఆలూరు వెంకట రమణారావు గో సంరక్షణ ధ్యేయంగా దేవస్థానంలో గోశాలను ఏర్పాటుచేసి ప్రత్యేకంగా గిరిజాతి ఆవులను తెప్పించారు. అయితే అందులో ఒకటి సోమవారం మృతిచెందింది. ఆవు కలేబరానికి పసుపు, కుంకుమలు రాసి పూజ చేసి శాస్త్రోక్తంగా ఖననం చేశారు. నిర్వహించారు.

బొడ్డురాయికి మండలపూజా వేడుకలు

సంతనూతలపాడు, మార్చి 25:సంతనూతలపాడులో సోమవారం బొడ్డురాయి మండలపూజా వేడుకలు ఘనంగా జరిగాయి. బొడ్డురాయి ప్రతిష్ఠ 41 రోజుల అనంతరం పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వాహనాల తనిఖీలు



ఆర్టీసీ బస్సులో ప్రయాణికులను తనిఖీ చేస్తున్న అధికారులు

కొండపి, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారులు మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామం వద్ద ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను, ఇతర వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, ఇతర అనుమానాస్పద వస్తువులు ఉంటే స్వాధీనం చేసుకుంటామని వారు తెలిపారు.

ట్రాన్స్‌జండర్ ఆత్మహత్య

ఒంగోలుక్రైం,మార్చి25: ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్యకు పాల్పడింది. అద్దంకి చెందిన తమ్మిశెట్టి స్వాతి(27) ప్రస్తుతం స్థానిక సత్యనారాయణపురంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ ఆదివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాలలోకి వెళితే స్వాతి ఒంగోలులో నివాసం ఉండి జీవనం సాగిస్తున్నది. ఆమెకు ఓ ప్రియుడు ఉన్నాడు. వారిమధ్య మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నియంతృత్వ శక్తులను వచ్చే ఎన్నికల్లో ఓడించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నియంతృత్వ శక్తులను ఓడించాలని బహుజన పార్టీల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జైభీమ్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజన పార్టీల జేఏసీ ఒంగోలు, సంతనూతలపాడు, కనిగిరి, కొండపి, వైపాలెం నియోజకవర్గాలతో పాటు ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ డెమొక్రటిక్ నాయకుడు అబ్దుల్ సత్తార్, పీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరిసుందరం తదితరులు ఉన్నారు.



సుబ్బమ్మకు నివాళ్లులర్పిస్తున్న రాఘవరెడ్డి

ఎమ్మెల్యేను పరామర్శించిన రాఘవరెడ్డి

తూర్పునాయుడుపాలెం (టంగుటూరు), మార్చి 25 : తల్లి మృతితో విషాదంలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన తూర్పునాయుడుపాలెంలోని స్వగృహంలో ఉన్న ఎమ్మెల్యేను కలిసి కొంతసేపు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాతృమూర్తి సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాఘవరెడ్డి వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బెల్లం సత్యం ఉన్నారు



కొత్తపట్నం మండల నేతలతో టీడీపీ అభ్యర్థి జనార్దన్

భవిష్యత్ బాగుకు చంద్రబాబును సీఎం చేయాలి

● ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్

కొత్తపట్నం(ఒంగోలునగరం) మార్చి 25: రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే నారా చంద్రబాబునాయుడినే ముఖ్యమంత్రిగా గెలిపించాలని తెలుగు దేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని బీరంగుంట, గాదెపాలెంలో గ్రామాల్లో జనం కోసం జనార్దన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి యువతతో, మహిళలతో మాట్లాడారు. ఇంటింటికీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేసి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ రాజ్యం వస్తుందని చెప్పారు.వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రంలో సంక్షేమ రాజ్య స్థాపన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు గేనం సుబ్బారావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, బలగాని వెంకటేశ్వర్లు, పురిణి శ్రీనివాసులరెడ్డి, తాటిపర్తి చిన వెంకారెడ్డి ఐనంపూడి సుబ్బారావు, గద్దె నాగార్జునరెడ్డి టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'చీరాల'లో మహిళలే కీలకం

చీరాల, మార్చి 25: చీరాల నియోజకవర్గంలో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 2,00,332(ప్రస్తుతం) మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 97,559 మంది. మహిళలు 1,02,750 మంది, ఇతరులు 23 మంది ఉన్నా రు. పురుషుల కన్నా మహిళల ఓట్లు 5వేల చిలుకు ఉన్నాయి. దీంతో మహిళా ఓట ర్లు కీలకం కానున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓట్లు చేర్పులకు అవకాశం ఉంది. అప్పటికీ ఓటరు జాబితాలో మరికొన్ని చేర్పులు ఉండొచ్చు. ఆతరువాత చివరి ఓటరు జాబితాను ప్రచురిస్తారు. ప్రధాన పార్టీల అభ్య ర్థులను ప్రకటించటంతో ఇప్పటినుంచే ఆయా పార్టీల శ్రేణులు అందుబాటులో ఉన్న ఓటరు జాబితాలలో ఎవరికి ఎక్కడెక్కడ అనుకూలంగా ఉంటుంది, ఎక్కడెక్కడ ప్రతికూలంగా ఉంటుందనే కోణంలో పోస్టుమార్టం చేసుకుంటున్నారు. నామినేషన్ల ప్రక్రి య కన్నా ముందుగానే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభించా రు. నియోజక వర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గంతో విలక్షణంగా సాగుతున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అడుగులు ఎటు అనే విషయంపై కూడా జ నాల్లో చర్చ జరుగుతోంది.

అన్నపూర్ణాదేవి మందిరం ప్రారంభం

అద్దంకి, మార్చి 25: శింగరకొండ వాసవికన్యకాపరమేశ్వరి అన్నదాన సత్రంలో కాశీ అన్నపూర్ణాదేవి మందిరాన్ని సోమవారం ప్రారంభించారు. దాతలు గార్లపాటి శ్రీనివాసరావు, రాధారాణి సహకారంతో అన్నపూర్ణాదేవి మందిరం నిర్మాణం చేశారు. సత్రం అధ్యక్షుడు శ్రీరాం నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, బాస్కర్ సప్లయర్స్ అధినేత, టీడీపీ నాయకుడు గార్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి రాత అలవర్చుకోవాలి

ఇంకొల్లు, మార్చి 25: విద్యార్థులు చదువుతో పాటు మంచి రాత అలవర్చు కోవాలని పీవీఆర్ అకాడమీ ఆఫ్ హ్యాండ్ రైటింగు ఒంగోలు శిక్షకులు మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని గంగవరంలో బాలల విద్య వైజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా తెలుగులో మంచి రాతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ ఆత్మకూరి సుబ్బారావు, కరి కమలేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... లక్ష్మీనరసింహుని కల్యాణం

పృథులగిరికి పోటెత్తిన భక్తజనం







కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం (ఇన్‌సెట్లో) లక్ష్మీనరసింహుడు

మద్రిపూడి, మార్చి 25 : పృథులగిరి లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం మారుతీ ఆచార్యులు శాస్త్రోక్తంగా ఈ క్రతువు నిర్వహించారు. ముందుగా యాగశాలలో హోమాదికాలు నిర్వహించి లక్ష్మీనరసింహుని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవమూర్తులను ఎదురుకోల కోసం మెట్లమార్గం ద్వారా వాసవి అన్నదానసత్రం వరకు తీసుకొచ్చారు. అక్కడ ఉభయదాతలు కుప్పం వంశీకులు ఎదురుకోల ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. రాత్రికి కల్యాణ నరసింహుల విగ్రహాలను సర్వాంగసుందరంగా అలంకరించి గజవాహనంపై ఉంచి మాడవీధుల్లో భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగించారు. గజవాహనంపై ఆశీనుడైన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య స్వామివారికి ముత్యాల తలంబ్రాలు పోశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుప్పం కొల్లారావ్, ఈవో శ్రీనివాసరావ్, సిబ్బంది కాటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నేతల హడావుడి

» శింగరకొండలో సామాన్య భక్తులకు చుక్కలు

» పార్టీ రంగులతో ఉన్న ట్యాంకర్‌తో అన్నదాన సత్రాలకు నీటి సరఫరా



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న వైసీపీ అద్దంకి, చీరాల అభ్యర్థులు హనిమిరెడ్డి, వెంకటేష్

అద్దంకి, మార్చి 25: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల సోమవారంతో ముగిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ ప్రభల ఏర్పాటు బాగా తగ్గటంతో భక్తుల రద్దీ కూడా తక్కువగా ఉంది. ఇక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నేతలు మాత్రం హడావుడి చేశారు. వైసీపీ రంగులతో ఉన్న ట్యాంకర్‌తో అన్నదాన సత్రంల వద్ద నీటి సరఫరా చేయటం విమర్శలకు తావిస్తుంది. అదేసమయంలో వైసీపీ అద్దంకి, చీరాల అభ్యర్థులు పాణెం హనిమిరెడ్డి, కరణం వెంకటేష్‌లు మంది మార్బలంతో దేవాలయంలో పూజలకు హాజరు కావటంతో సాధారణ భక్తులకు మరింత ఇబ్బంది కలిగింది. నాయకుల సేవలతో తరించిన దేవాలయ సిబ్బంది, పోలీస్‌లు సాధారణ భక్తుల వాహనాలను ఎండ సమయంలో సైతం నామ్ రోడ్డు వద్దనే నిలిపివేశారు. దీంతో దేవాలయం వద్దకు వెళ్ళే భక్తులు ఎండవేడిమికి ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల రద్దీ ఒకింత ఉండగా, అనంతరం క్యూలైన్‌లతో పాటు దేవాలయ పరిసరాలు సైతం ఖాళీగా దర్శనమిచ్చాయి. తిరునాళ్లలో ఒకేఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటుచేయటంతో రాత్రి సమయంలో కూడా భక్తుల రద్దీ తక్కువగా ఉంది.

సమన్వయంతో పనిచేద్దాం.. వైసీపీని గద్దె దింపుదాం

» జనసేన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



ఎమ్మెల్యే సాంబశివరావు, విజయకుమార్‌ను సన్మానిస్తున్న జనసైనికులు

పర్చూరు, మార్చి 25: సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో అహంకార, నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక కొల్లావారి కల్యాణ మండపంలో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్‌కోసం టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు చారిత్రకమైన నిర్ణయమని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం, అరాచకం తప్ప అభివృద్ధి మచ్చుకైన కానరాలేదన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయకుమార్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పిలుపుమేరకు ఏలూరి సాంబశివరావు విజయంలో జనసైనికులు కలసి కట్టుగా పనిచేసి అత్యధిక మెజార్టీని తీసుకురాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి, విజయకుమార్‌ను జనసైనికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, కఠారి సురేంద్రబాబు, దీర్ఘాల రమేష్, ఒగ్గిశెట్టి నరసింహం, తులసి చంటి, రంగిశెట్టి ఆంజనేయులు, శీలం కుమార్, కందా సురేంద్ర, లగడపాటి నాగరాజు, లగడపాటి శంకర్, నారిశెట్టి మల్లి, దాసరి సాంబయ్య, పెంజంధ్ర రమణ, రంగిశెట్టి సింగయ్య, పసుపులేటి రవి, సుధాకర్, తులసి నాగు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో వైసీపీ కోటకు బీటలు

» ముస్లిం మైనారిటీ నేతలతో పాటు వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు వైసీపీ నేతలు

మార్టూరు, మార్చి 25: మార్టూరులో అధికార పార్టీ కోటకు బీటలు పడుతున్నాయి. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరుతున్నారు. సీనియర్ నాయకుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం ఉదయం మండలంలోని ఇసుక దర్శిలో గల క్యాంపు కార్యాలయంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లుతో పాటు మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు గన్నవరం బుడే, మార్టూరు పంచాయతి మూడవ వార్డు మెంబరు నందూరి ఖాసిం, నాల్గవ వార్డు మెంబరు చందోలు ఖాజావలి, 13వ వార్డు మెంబరు పెన్నుబోయిన భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకుడు అట్లూరి బాబూరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు అనుచరులతో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతించారు. 4నెలల క్రితం వైసీపీకి చెందిన 11 వార్డు మెంబరు కన్నెగంటి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు.



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లు

ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రం కోలుకోవాలన్నా, రాష్ట్ర ప్రజానీకం భవిష్యత్తు బాగుపడాలన్నా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావలసిన అవసరం ఏర్పడిందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబుపై నమ్మకంతో పార్టీలో చేరిన వైసీపీ నాయకులను ఆయన అభినందించారు. ఒక ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి వీడ్కోలు పలకడానికి సైనికుల్లాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, జాష్టి సాంబశివరావు, కమ్మ శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నతాళి ఉపసర్పంచ్ చేరిక

జొన్నతాళి ఉపసర్పంచ్, వైసీపీ నేత ఆవుల కోటిరెడ్డి అనుచరులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పలువురు బీసీ నాయకులు పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.

కబడ్డీ క్రీడాకారులకు సన్మానం

చినగంజాం, మార్చి 25: స్థానిక బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యం లో కబడ్డీ క్రీడాకారులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీ వల బీహార్‌లో జరిగిన 33వ అంతర్జాతీయ సబ్‌జూనియర్ జాతీయ కబడ్డీ చాం పియన్ షిప్ పోటీల్లో ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టు 3వ స్థానంలో నిలిచింది. జట్టులో ఉన్న చినగంజాం ప్రాంతానికి చెందిన అట్ల అభిషేక్‌రెడ్డి, భోగిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఆట్ల అశోక్‌రెడ్డిలకు, ఆడుదాం ఆంధ్ర యంగ్ టాలెంటెడ్ క్రీడాకారుడుగా ఎంపికై రూ.10 లక్షల అవార్డు అందుకున్న బాలకృష్ణారెడ్డికి స్పోర్ట్సు క్లబ్ అధ్యక్షుడు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎం.గిరిబాబు, సభ్యు లు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భోగిరెడ్డి నాగాంజనేయరెడ్డి, కోశాధికారి దేశం సుబ్బారెడ్డి, బి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు గొర్రెపాడులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బల్లికురవ, మార్చి 25: మండలంలోని గొర్రెపాడు లో ఏర్పాటుచేస్తున్న అభ యాంజనేయ స్వామి విగ్రహ పతిష్ఠ బుధవారం ఉద యం 8.14 గంటలకు జరగ నుంది. యాగశాలను ఏర్పా టుచేసి పూజలు ప్రారంభించారు. అభయాంజనేయ స్వామి పక్కనే బాల వీరాం జనేయస్వామి, వినాయక స్వామి విగ్రమాలను కూడా ప్రతిష్ఠించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామం లో సోమవారం ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది.

ఎంపీ సురేష్ కాన్వాయ్‌తో భక్తులకు ఇక్కట్లు

అద్దంకి, మార్చి 25: బాపట్ల ఎంపీ సురేష్ కాన్వాయ్‌తో సోమవారం రాత్రి శింగరకొండ తిరునాళ్లకు రావడంతో రాత్రి 9.30 గంటల సమయంలో భక్తులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 9 గంటల వరకు భక్తుల సందడి పెద్దగా లేకపోగా, 9 గంటల సమయం నుంచి భక్తులు రాక ప్రారంభమైంది. అదేసమయంలో ఎంపీ కాన్వాయ్ తిరునాళ్లలోకి రావవంతో భక్తులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. దీంతో మహిళలు, వృద్ధులు మరింత ఇబ్బంది పడ్డారు.

టీడీపీలోకి వలసల పర్వం



పర్చూరులో టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మార్చి 25: ఎన్నికలు సమీ పిస్తున్న తరుణంలో టీడీపీలోకి వలసల పర్వం జోరందుకుంది. రోజురోజుకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున చేరుతున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశిరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. పర్చూరు, చినగంజాం, మార్టూరు, కారంచేడు మండలాల పరిధిలో వివిధ సామాజిక వర్గాల నుంచి భారీగా చేరికల పర్వం కొనసాగుతుంది. సోమవారం కారంచేడు మండలం ఆదిపూడికి చెందిన వైసీపీ నాయకులు పారి గ్రేసయ్య, ధరరాజుపల్లి నాగరాజు, పారి వినోద్ కుమార్, వలేరు కల్యాణ్ బాబు, వంశీకృష్ణ, కోటేశ్వరరావు, జంతాల సుబ్బారావు, పారి రమేష్‌తోపాటు దాదాపు 50 కుంటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. అలాగే, పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వైసీపీ నాయకులు దున్నా సుబ్బారావు, తమ్ములూరి చిట్టిబాబు, దున్నా మరియదాసు, నేహేమియా, మురికిపూడి అశోక్, దున్నా శ్యామ్యూల్, ప్రేమ్‌కుమా ర్, మహేష్, కట్టెంపూడి గోపీ చెంద్, ఉన్నా చిన్నా అక్కయ్యలు పార్టీలో చేరారు. పర్చూరులోని 16వ వార్డులోని వైసీపీకి చెందిన పలు కుంటుంబాలు కొల్లా శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, తంగెళ్ళ మల్లికార్జునరావు, దూళ్లిపల్లి వెంకటస్వామి, మామిడిపాక హరిప్రసాద్, కొండ్రగుంటి సుబ్బారావు, ఆకుల మధుబాబు, మల్లాది సురేష్, చెరుకూరి చింపయ్య, కాపు బుల్లోడు, మక్కెన శేఖర్‌బాబు, కంచేటి శ్రీహరి, షేక్ బషీర్, పఠాన్ సమీర్, తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యకు పలువురు మద్దతు



కొండయ్యకు మద్దతు తెలుపుతున్న మాజీ కౌన్సిలర్ పండ్లూరి ప్రమీలమ్మ, ఆనందరావు

చీరాల, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు రోజురోజుకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. సోమవారం స్థానికి టీడీపీ కార్యాలయంలో కొండయ్యను మున్సిపల్ 28వ వార్డు మాజీ కౌన్సిలర్ పండ్లూరి ప్రమీలమ్మ, ఆనందరావు కలిసి తమ మద్దతు తెలిపారు. వేటపాలెం మండలం రామాపురంకు చెందిన పలువురు మత్స్యకారులు వాయిల పెరుమాళ్ ఆధ్వర్యంలో కొండయ్యను కలసి మద్దతు తెలిపారు. వారి మెడలో కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ పీకా మాణిక్యరావు తదితరులు కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు.

చీరాల మండలం ఈపురుపాలెం పద్మనాభునిపేట శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ జడ్పీటీసీ గుద్దంటి చంద్రమౌళితో కలిసి కొండయ్య పాల్గొన్నారు. స్థానిక చేనేత పెద్దలు, నాయకులు, భక్తులతో మాట్లాడారు. వేటపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షుడు చప్పిండి వెంకట్రావు ఆధ్వర్యంలో పుల్లరిపాలెం మాజీ సర్పంచ్ ఆసోది అంకిరెడ్డి కొండయ్యను కలిసి మద్దతు తెలిపి పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం!



ఆత్మహత్యకు పాల్పడిన వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చీరాల నియోజకవర్గ చేనేత ప్రతినిధులు

చీరాల, మార్చి 25: కడప జిల్లా ఒంటి మిట్టలో వైసీపీ నేతల భూ ఆక్రమణతో మన స్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కుటుంబ సభ్యులను సోమవారం చీరాల నియోజకవర్గానికి చెందిన చేనేత జనసమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మాచర్ల మోహనరావు, టీడీపీ నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధైరపడొద్దు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతిచెందిన ఒక్కొక్కరికి రూ.50లక్షలు చొప్పున కుటుంబసభ్యులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో గుత్తి శివయ్య దేవనకోటి నాగేశ్వరరావు, వావిలాల దాశరధి పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

- ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు
- కంభం, అర్ధవీడు మండలాల నుంచి 500 కుటుంబాలు
- అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిక
- చోళ్లవీడులో జగన్ పార్టీని వీడిన 100 మంది


టీడీపీలో చేరిన చోళ్లవీడు జడ్పీటీసీ మాజీ సభ్యుడు, మాజీ సర్పంచ్‌తో అశోక్‌రెడ్డి

కంభం, మార్చి 25 : అధికారపార్టీకి షాక్ తగిలింది. కం భం, అర్ధవీడు మండలాల నుంచి సుమారు 500 కుటుంబాలు వైసీపీని వీడి గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సోమవారం కంభంలో ఆ మండల జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి, ఆమె భర్త కందులాపురం మాజీ సర్పంచ్ కొత్తపల్లి శ్రీనివాసులు వైసీపీని వీడి టీడీపీలో చేరి పార్టీ కండువా కప్పుకున్నారు. వీరితోపాటు అర్ధవీడు మండల ఎంపీపీ మేడిద వెంకటరావు, తురిమెళ్ల సర్పంచ్ మాదా సుభద్ర, మాదా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, మాగుటూరు సర్పంచ్ కేతావత్ ఈశ్వరీబాయి, జయరామ్‌నాయక్, సాగర్, కందులాపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు కటికల భాస్కర్, కంభం మండల ఆర్యవైశ్య ప్రముఖులు బిజ్జాల కిశోర్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వా రి అనుచరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో అభివృద్ధి , సంక్షేమం అశోక్‌రెడ్డి హయాంలోనే జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో కందులాపురం వార్డుమెంబర్ గజ్జా అంకయ్య గౌడ్, తడవ వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీరాములు, నారాయణ, పత్తి పాండు, భీమవరపు వెంకటసుబ్బయ్య, సంకతాల నాగేశ్వరరావు, చెన్నకేశవుల సుబ్బరాయుడు, ఆవుల వెంకటేశ్వర్లు, కొ మరోలు చంద్రశేఖర్, వార్డుమెంబర్ గోపాల్, మద్దికట్ల పిచ్చయ్య, ఏలం వెంకటేశ్వరరావు, మాదా వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి సుబ్బయ్య, గన్నారపు తిరుపతయ్య, జనార్దన్, రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి బాదం మనోహర్, కొనతం సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, స్వామిరంగారెడ్డి, చిన్నరంగారెడ్డి, జయరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆదివారం రాత్రి రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామ జడ్పీటీసీ మాజీ సభ్యులు బత్తిని లలిత కుమారి, మాజీ సర్పంచ్ బత్తిని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు, విద్యా కమిటీ చైర్మన్, ముగ్గురు వార్డుమెంబర్లు, కాపు సంఘం ముఖ్య నాయకులతో సహా 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

కాపుల సంక్షేమం టీడీపీతోనే

- టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి

- వైసీపీని వీడి టీడీపీలో చేరిన రాచర్ల మండల జడ్పీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచ్

గిద్దలూరు టౌన్, మార్చి 25 : కాపుల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామ జడ్పీటీసీ మాజీ సభ్యులు బత్తిని లలితకుమారి, మాజీ సర్పంచ్ బత్తిని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు, విద్యా కమిటీ చైర్మన్, ముగ్గురు వార్డుమెంబర్లు, కాపు సంఘం ముఖ్య నాయకులతో సహా 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కాపులకు టీడీపీ హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడిమెట్ల రంగనాయకులు, విద్యాకమిటీ చైర్మన్ గుడిమెట్ల రంగయ్య, 1, 5, 6 వార్డుమెంబర్లు చల్లా గురువయ్య, బత్తిని కృష్ణయ్య, బత్తిని అచ్చమ్మ, పేర్ల నెమలియ్య, ప్రసాద్, అబ్బిశెట్టి ప్రసాద్, శిరిగిరి నందయ్య, ముత్యాల శివ, ముత్యాల నారాయణ, బత్తిని వెంకటరమణ, గుడిమెట్ల వెంకటరంగయ్య, గుడిమెట్ల రాములు, గుడిమెట్ల పాండు టీడీపీలో చేరగా కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, టీడీపీ నాయకులు జీవనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


స్వామి అమ్మవారికి కల్యాణ తంతును నిర్వహిస్తున్న వేదపండితులు

కమనీయం వేంకటేశ్వరస్వామి కల్యాణం

గోవింద నామస్మరణలతో మార్మోగిన వెలిగొండ

కొనకనమిట్ల, మార్చి 25 : వెలిగొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీలక్ష్మీఅలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం తెల్లవారుజామున కమనీయంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా వెలిగొండ వేంకటేశ్వర స్వామి, శీలక్ష్మీఅలవేలుమంగ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతరెడ్డి, ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి స్వామివార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణం సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఎదురుకోళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. వధూవరులైన స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో ప్రత్యేకగా అలంకరించి వేదపండితులు మంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యాల మోగుతుండగా ముత్యాల తలంబ్రాలతో కల్యాణం ఘట్టాన్ని వేడుకగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ వేడుకను చూసి తరించారు. ఏడుకొండలవాడ వేంకటేశ్వరా గోవిందా గోవిందా అంటూ చేసిన నామస్మరణ మార్మోగింది. అనంతరం శ్రీలక్ష్మీఅలవేలుమంగ సమేతుడై సూర్య రవాహనంపై కొలువుదీరారు. భక్తులకు అభయ హస్తాన్ని చూపిస్తూ వెలిగొండ పురవీధుల్లో స్వామి వారు ఊరేగారు. కార్యక్రమాలను ఈవో చెన్నకేశరెడ్డి, చైర్మన్ తిరుపతరెడ్డి, ఉభయదాతలు, పలువురు ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

హోలీ వేడుకలు


హోలీ ఆడుతున్న చిన్నారులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 25: రంగుల పండుగ హోలీని మార్కాపురం పట్టణంలో సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. యువత, చిన్నారులు వీధుల వెంబడి తిరుగుతూ ఒకరిపై ఒకరు రంగులు, గులాములు చల్లుకున్నారు. పట్టణంలోని రాజస్థానీలు సాంప్రదాయబద్ధంగా హోలీ పండుగ నిర్వహించారు.

గిద్దలూరు, మార్చి 25 : హోలీ పండుగను వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్యంగా తాండాలలోని ఎస్టీలు, లంబాడీలు హోలీ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిగువమెట్ట, దిగువమెట్టతాండా, కేఎస్‌పల్లి, బురుజుపల్లి తాండా, ఓబులాపురం తాండా తదితర గ్రామాలలోని తాండావాసులు హోలీ పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఇళ్లలో, దేవాలయాలలో పూజలు నిర్వహించుకుని రంగులు చల్లుకుంటూ సామూహికంగా నృత్యాలు చేస్తూ హోలీ పండుగను జరుపుకున్నారు. గిద్దలూరులోని పలు వీధుల్లో, పాఠశాలల్లో రంగులు, నీళ్ల చల్లుకుని హోలీని జరుపుకున్నారు.

అనాథలకు ఆర్థిక సాయం


పిల్లలకు ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ నాయకులు

బేస్తవారపేట, మార్చి 25 : బేస్తవారపేట మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ముగ్గురు పిల్లలకు దాతలు ఆదుకున్నారు. గిద్దలూరు రజక అభివృద్ధి సంఘం సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ముగ్గురు పిల్లలకు పోస్టాఫీసులో రూ.1,30,000 నగదును ఫిక్సడు చేసి ఆ బాండ్‌ను పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘ అధ్యక్షుడు పీ బాలచెన్నయ్య, అలసందపల్లి రామాంజనేయులు తురిమెళ్ల సురేష్, బోయిళ్లపల్లి నాగకిరణ్, లక్ష్మీరంగయ్య, కొండేటి రాజు, చలిజాముల ఖాదరయ్య, తూర్పునాటి గోపాల్, అసలందపల్లి పాండు పాల్గొన్నారు.

ఎన్నికలపై ప్రజలకు అవగాహన


కుంచేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పొదిలి, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికలపై సోమవారం కుంచేపల్లి గ్రామంలో ఎస్ఐ కోటయ్య అవగాహన కల్పించారు. ఎలాంటి హింసాత్మకమైన సంఘటనలకు తావులేకుండా ప్రజలు ఎన్నికలకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ గ్రామంలో పెద్దలు, యువకులు ఎన్నికల సమయంలో మీ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వచ్చినట్లు సమాచారం ఉంటే వెంటనే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా గ్రామాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో ఏపార్టీ నుంచి గానీ నాయకుల నుంచి గానీ సమస్య ఉంటే వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని వెంటనే పోస్ట్ చేయకుండా క్షణ్ణంగా పరిశీలించుకోవాలని ఆ తరువాత పోస్ట్ చేయాలని సూచించారు. అలాంటి పోస్ట్‌వలన శాంతి భద్రతలకు భంగం కలిగినట్లైతే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కనుక గ్రామాల్లో ఎలాంటి హింసకు తావివ్వకుండా ఎన్నికలు జరుపుకునేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల


ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ, స్వామి కటౌట్

చినగంజాం, మార్చి 25: కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ సెంటర్ లో వేంచేసియున్న శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్ల సోమ వారం రాత్రి వైభవంగా నిర్వ హించారు. స్వామి వారికి వే కువజాము నుంచే అభిషేకాలు, ఆకుపూజలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూ జారి మాజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామిని పలు రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరి గింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం దేదీప్య మానంగా వెలుగొందింది. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభ, వీరాంజనేయస్వామి విద్యుత్ కటౌట్‌ను ఏర్పా టుచేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి.


కల్యాణంలో రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవుడు

వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 25: మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారి తిరునక్షత్ర మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు మధ్య రంగ మండపంలో చెన్నకేశవ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించిన భక్తులు పులకరించిపోయారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించాలి


అవగాహన కల్పిస్తున్న జిల్లా స్థాయి ట్రైనీ సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 25: ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా స్థాయి ట్రైనీ సుబ్బారావు అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వీవీ ప్యాట్లు, ఈవీఎంలు ఎన్నికల నిబంధనలు, ఎలక్టోరల్ ఫారం నింపడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీఈవో సుభద్ర, జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి మాధురి, యర్రగొండపాలెం రిటర్నింగ్ అధికారి శ్రీలేఖ, ఎలక్షన్ డీటీ శ్రీనివాసులు, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ట్రైనీ వెంకారెడ్డి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

గిద్దలూరు టౌన్, మార్చి 25 : ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దిగువమెట్ట చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక అధికారి ఆర్.రత్నకిశోర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం రత్నకిశోర్, ఇతర అధికారులు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసి పంపిస్తున్నారు.

వైసీపీకి నూకలు చెల్లాయి

- టీడీపీ అభ్యర్థి కందుల
- వైసీపీ వీడిన 300 కుటుంబాలు


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కందుల


కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కందుల

తర్లుపాడు, మార్చి 25 : రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన వైసీపీకి ఇక నూకలు చెల్లాయని మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. తర్లుపాడులో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గత 40 సంవత్సరాల నుంచి తర్లుపాడు మండలాన్ని ఏకచక్రాధిపత్యంగా పరిపాలించిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, పీఏసీఎస్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి ఆధ్వర్యంలో 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి కందుల పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత 40 ఏళ్లుగా తర్లుపాడులో ఏలుతున్న రావి కుటుంబంలోని రావి బాసపతిరెడ్డి వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరడం శుభపరిణామం అన్నారు. దీంతో తర్లుపాడు మండలంలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ తథ్యం అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ప్రజలు విసిగెత్తి ఆ పార్టీకి రాజీనామాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి నారా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఆదరిస్తే మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ పరిశీలకుడు బెజవాడ సురేష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నపురెడ్డి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు చేతుల శ్రీనివాసులు, బీజేపీ నాయకులు లక్ష్మీరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, మాజీ ఎంపీపీ పీ ఏసుదాసు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి కె.కాశయ్య, టి.సత్యనారాయణ , పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రన్న వస్తేనే రాష్ట్రం సుభిక్షం

- పెద్ద బొమ్మలాపురంలో వైసీపీని వీడిన 30 కుటుంబాలు
- టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు సమక్షంలో చేరిక


చేరికల అనంతరం మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, మార్చి 25: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చంద్రబాబు వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు గూడూరి వివరించారు. గ్రామంలోని పడమటి పల్లె, తూర్పు పల్లెకు చెందిన 30 ఎస్సీ కుటుంబాలు విశ్రాంత ఉపాధ్యాయులు బేతం జాన్, కొప్పుల దానియేలు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎరిక్షన్ బాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన శని కొద్ది రోజుల్లో వీడి పోతుందని, సంక్షేమం, అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతూ దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించడంతో ఈ ప్రాంతం అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ప్రధానంగా అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళామ తల్లులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ఎంత మంది ఆడబిడ్డలున్నా ప్రతి ఒక్కరికీ నెలకు రూ.1,500 అందజేత, ఏడాదికి రూ.15,000 మంజూరు చేసి ఆర్థిక తోడ్పాటు నందించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు రూ.3వేలు అందజేయడంతో పాటు ఏటా లక్ష ల్లో ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. రైతులకు ఏడాదికి రూ.20,000లు పెట్టుబడి సా యం అందజేత, ఇంటింటికీ నీటి కొళాయి ఏ ర్పాటు, బీసీ రక్షణ చట్టం అమలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ ఇస్మాయిల్, షేక్ మంజూర్ బాషా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న నాగజ్యోతి

56 సమస్యాత్మక బూత్‌లు

కొమరోలు, మార్చి 25: గిద్దలూరు నియోజకవర్గంలో 285 పోలింగ్ బూత్‌లకుగాను 56 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి డీ నాగజ్యోతి తెలిపారు. మండలంలోని ప్రకాశం - కడప జిల్లాల సరిహద్దులోని అల్లినగరం సమీపంలోని చెక్‌పోస్టును సోమవారం గిద్దలూరు రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి తనిఖీ చేశారు. అనంతరం నాగజ్యోతి మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల నుంచి రూ.50 వేల కన్నా ఎక్కువ తరలిస్తే విధిగా సంబంధించిన రసీదులు చూపించాల్సి ఉందన్నారు. ఈ చెక్ పోస్టును 24 గంటలపాటు ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయన్నారు. అనంతరం అల్లినగరంలోని రెండు పోలింగ్ బూత్‌లను పరిశీలిచారు. మండలంలోని 41 పోలింగ్ బూత్‌లలో వసతులు ఎలా ఉన్నాయని ఏఆర్‌వో మల్లికార్జున నాయుడును, ఎస్ఐ మధును అడిగి తెలుసుకున్నారు.

ఉచిత ప్రవేశాలకు గడువు పొడగింపు

పొదిలి, మార్చి 25 : పేద పిల్లలకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లలో 1వ తరగతికి దరఖాస్తుల గడువును మార్చి 31వ తేదీ వరకు పొడగించినట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. పేదపిల్లలు ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. చేరేవారు విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పేదల బియ్యం పక్కదారి

- రేషన్ దుకాణం నుంచి మిల్లులకు తరలింపు
- రీసైక్లింగ్ చేసి చెన్నై, బెంగళూర్లు, ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- మాఫియాగా మారి దోచుకుంటున్న వైసీపీ నాయకులు


రాజుపాలెంలో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

త్రిపురాంతకం, మార్చి 25 : పౌరసరఫరాల బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు మాఫియా అవతారం ఎత్తి పేదల బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమార్జనకు తెగబడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో రేషన్ ద్వారా ఇచ్చే పేదల బియ్యాన్ని సేకరించి స్థానికంగా కొన్ని రైస్ మిల్లులను అద్దెకు తీసుకుని వాటిలో రీసైక్లింగ్ చేసి చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, కార్డుదారులకు కిలోకు రూ. 10నుంచి రూ.12 చొప్పున చెల్లించి వారికి ఇవ్వాల్సిన బియ్యాన్ని మధ్యవర్తుల ద్వారా ఆయా మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది అధికారుల దాడులు జరుగుతున్నాయన్న సమాచారంతో సుమా రు 250 బస్తాల బియ్యాన్ని త్రిపురాంతకం సమీపంలోని నాసరయ్య మఠంలో నిల్వ చేశారు. సమాచారం అందుకున్న అధికారులు దాడులు నిర్వహించి బి య్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా అడపాదడపా దాడులు నిర్వహించి చిన్న చిన్న ఆటోలలో, మినీ లారీలలో తరలించే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటనలు జరిగాయి. గత సెప్టెంబర్‌లో మండలంలోని రాజుపాలెంలో రైస్ మిల్లులపై దాడులు జరిగాయి. ఈ దాడులలో సుమారు 36.90 టన్నుల బియ్యాన్ని అధికారుల స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారం తర్వాత మరోసారి జరిగిన దాడులలో మరొక మిల్లులో సుమారు 125 బస్తాల రేషన్‌బియ్యం పట్టుబడ్డాయి.

వెదురు బొంగుల పట్టివేత


వెదురుబొంగులను అటవీ సిబ్బందికి అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

గిద్దలూరు, మార్చి 25 : ఆర్పీఎఫ్ పోలీసులు రైళ్లలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. హుబ్లీ నుంచి విజయవాడకు, కాచిగూడ నుంచి గుంటూరుకు వెలుతున్న రైళ్లలో గిద్దలూరు రైల్వేస్టేషన్లలో తననిఖీలు నిర్వహించారు. రైళ్లలో అక్రమంగా తరలివెళ్తున్న వెదురు బొంగుల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రైళ్లలో అనుమతులు లేని వస్తువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దొరికిన వెదురు బొంగులను అటవీ శాఖ బీట్ ఆఫీసర్ జమాల్‌వలికి అందచేశారు. దాడిలో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ శేషయ్య పాల్గొన్నారు.

టీడీపీ ప్రతి పథకం ప్రజాసంక్షేమం కోసమే

టీడీపీ నాయకులు ఎస్టీఆర్, పిచ్చాల, నారపరెడ్డి శ్రీను

సూపర్‌సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం చేపట్టిన నేతలు

కనిగిరి, మార్చి 25 : టీడీపీ గత పాలనలో అమలు చేసిన ప్రతి పథకం ప్రజాసంక్షేమం కోసమేనని, కొత్తగా చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలు సైతం ఎంతో మేలు చేకూరుస్తాయని కనిగిరి క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జి నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి చెప్పారు. మండలంలోని గానుగపెంట గ్రామంలో నారపరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై, డాక్టర్ ఉగ్ర 5 ప్రణాళికలపై ప్రజలకు వివరిస్తూ సోమవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారపరెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ అని అధికారం ఇస్తే జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాళా తీయించారని చెప్పారు.


గానుగపెంట గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న యడవల్లి శ్రీను


తక్కెళ్లపాడులో ప్రచారం చేస్తున్న పిచ్చాల శ్రీనివాసులరెడ్డి


వేములపాడు గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

చంద్రబాబుతోనే రాష్ట్రం ప్రగతి పథంలోకి వెళ్తుందన్నారు. చంద్రబాబును, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటేనే అటు రాష్ట్రం, ఇటు కనిగిరి ప్రాతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఓట్ల కోసం కల్లబొల్లి మాటలు చెప్పేందుకు వస్తున్న వైసీపీ నేతలను ఏం అభివృద్ధి చేశారో చూపించాలని నిలదీయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు మహిళలకు టీడీపీలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుడేసాహెబ్, గారపాటి రమణయ్య, మాజీఉపసర్పంచ్ చౌడయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నరసింహ, బీసీసంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఓబులురెడ్డి, నాగిరెడ్డి, భూత్ ఇన్‌చార్జిలు, గ్రామపార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడు గ్రామంలో...

కనిగిరి మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో తక్కెళ్లపాడుగ్రామంలో చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలపై సోమవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు, బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో... టీడీపీలోనే దళితులకు సముచిత స్థానం లభిస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్) చెప్పారు. మండలంలోని వేములపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సూపర్‌సిక్స్ పథకాల గురించి కాలనీ ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఏడాదికి ఉచితంగా రూ.15వేలు అందచేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు అందచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు గాయం రామిరెడ్డి, తాతపూడి స్టాలిన్(బుజ్జి), బ్రహ్మంగౌడ్, శివకుమారి, దశరథ, బూత్ ఇంచార్జిలు, గ్రామపార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడిని గుర్తించిన పోలీసులు

కనిగిరి, మార్చి 25 : స్కూల్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన బాలుడిని పోలీసులు గుర్తించి వారి తల్లితండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన ఉప్పు పెదవెంగయ్య కుమారుడు వెంగళరాయుడు మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం స్కూల్‌కు అని వెళ్లిన ఇంటికి రాకపోవటంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడి స్నేహితుడు ఇచ్చిన సమాచారంతో వెంగళరాయుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కనిగిరి పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాషా రోజూ స్వగ్రామమైన పొదిలికి రాకపోకలు చేస్తుంటారు. ఈ క్రమంలో అతను ఆదివారం రాత్రి 11గంటల ప్రాంతంలో పొదిలి డిపోలో దిగారు. డిపోలో బల్లపై పడుకున్న బాలుడిని చూసిన కానిస్టేబుల్ బాషా అనుమానం వచ్చి పరిశీలించటంతో అదృశ్యమైన బాలుడిగా గుర్తించాడు. దీంతో ఎస్ఐ త్యాగరాజుకు సమాచారం అందించారు. వెంటనే ఆ బాలుడిని కనిగిరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఎస్ త్యాగరాజు వారి తల్లితండ్రులకు అప్పగించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

ముండ్లమూరు, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఇందుకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా చర్యలు ఉంటాయని ఎస్ఐ వీ ఆంజనేయులు చెప్పారు. ఆయన సోమవారం మండలంలోని మారెళ్ల, జమ్మలమడక, మక్కెనవారిపాలెం గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన వారిని ఉద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ కూడా గ్రామాల్లో ఉన్న వాతావరణానికి భంగం కలిగించవద్దన్నారు. ఎవరైనా గొడవలు పడతారో వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే తెలియపరచాలన్నారు. గతంలో ఉన్న రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో గొడవలు పడిన వారిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు పెట్టి తహసీల్దార్ ఎదుట హాజరు పరుస్తామన్నారు.

పోరాటయోధుడు బాపనయ్య


బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు

పీసీపల్లి, మార్చి 25 : సామాజిక అసమానతలను అంతం చేయడంలో మొక్కవోని దీక్షతో సుందరయ్య బాటలో పయనించిన పోరాట యోధుడు గుంటూరు బాపనయ్య అని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు చెప్పారు. బాపనయ్య వర్ధంతి సందర్భంగా కోదండరామపురంలో వ్యవసాయ కార్మికులతో కలిసి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడుగు జనార్దన్, రాగి చినమాలకొండయ్య, పెదబాలయ్య, లక్ష్మమ్మ, బాలయ్య పాల్గొన్నారు.

మురుగు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మురుగును తొలగిస్తున్న కార్మికులు

పామూరు, మార్చి 25 : పామూరులోని వరవకట్ట కాలువ సప్లయ్‌చానెల్‌లో పేరుకుపోయి ఉన్న మురుగును గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు కాలువలో ఉన్న వ్యర్థాలను సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. మురుగు కూపంగా మారిన వరవకట్ట కాలు వ అనే వార్త శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి తన సిబ్బందితో వరవకట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. పలు చోట్ల పారిశుధ్య కార్మికులతో మురుగును తొలగించారు.

వైభవంగా కనకదుర్గమ్మ తిరునాళ్ల


అలంకరణలో అమ్మవారు

దొనకొండ, మార్చి 25 : దొనకొండలోని కురిచేడు వెళ్లే రైల్వే ట్రాక్ సమీపంలో నెలకొన్న కనకదుర్గమ్మ అమ్మవారు దేవాలయంలో తిరునాళ్ల వేడుకలు సోమవారం వైభవంగా కొనియాడారు. వేడుకల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కందుకూరులో మహిళ దారుణ హత్య

- భర్తే కొట్టి చంపేశాడని అనుమానం
- పరారీలో నిందితుడు


వనజాక్షి మృతదేహం


వనజాక్షి(ఫైల్)

కందుకూరు, మార్చి 25 : నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలో ఓ మహిళ సోమవారం మధ్యాహ్నం దారుణ హత్య కు గురైంది. స్థానిక పామూరురోడ్డు సర్కిల్ సమీపంలో గాయత్రీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న చిమటా వనజాక్షి (27) హత్యకు గురైంది. వనజాక్షి శరీరమంతా గాయాలతో రక్తపుమడుగులో విగతజీవిగా పడిఉండగా సోమవారం సాయంత్రం గుర్తించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వనజాక్షి భర్త శివకృష్ణ ఫోన్ స్విచ్చాఫ్ చేసి పరారీలో ఉండటంతో భర్తే ఆమెను హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.వనజాక్షి తలకు, చేతికి బలమైన గాయాలు ఉండటం, తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందటంతో రోకలిబండతో బలంగా కొట్టినట్లు భావిస్తున్నారు. ఇంటిప్రధాన ద్వారం వద్దే ఆమె కుప్పకూలిపోయి మృతిచెందగా తలుపు కూడా వేయకుండా హంతకుడు పరారయ్యాడు. మృతురాలు వనజాక్షిది శ్రీకాకుళం సమీపంలోని కోటబొమ్మాళి కాగా, పన్నెండేళ్లక్రితం శివకృష్ణతో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు. కాగా కొన్నేళ్లుగా పావని బ్యూటీపార్లర్ పేరుతో ఇంటివద్దే బ్యూటీపార్లర్ నడుపుతున్న వనజాక్షిని భర్తే హతమార్చాడన్న వార్త పట్టణంలో సంచలనం రేపింది. పట్టణ సీఐ హాఫీజ్ మృతదేహాన్ని సందర్శించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడివడిగా దర్శి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు

- ఈ నెలాఖరులోపు పనులన్నీ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశం
- ఏప్రిల్‌లో రైళ్లు నడిపేందుకు సన్నాహాలు


దర్శి వద్ద నూతనంగా నిర్మిస్తున్న రైల్వేస్టేషన్


రైల్వేస్టేషన్ వద్ద చేస్తున్న లైనింగ్ పనులు

దర్శి, మార్చి 25 : దర్శి పట్టణ సమీపంలో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు వడివడిగా జరుగుతున్నాయి. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను నిర్మాణంలో భాగంగా తొలిదశలో దర్శి వరకు వచ్చే నెల నుంచి రైళ్లు నడపాలని ఆ శాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే గూడ్స్ రైళ్లు దర్శికి మెటీరియల్ తీసుకొని వచ్చాయి. రైల్వే లైను పటిష్టతను తనిఖీ చేసేందుకు ప్రయోగాత్మకంగా అధికారులు గూడ్స్ రైలులో మెటీరియల్ ఇక్కడకు తెచ్చారు. దర్శి వరకు రైల్వే లైను నిర్మాణం పూర్తయింది. అక్కడక్కడా పెండింగ్‌లో ఉన్న పనులు ముమ్మరంగా చేస్తున్నారు. అదేవిధంగా ఇక్కడ ప్రయాణికులు టికెట్లు తీసుకునేందుకు, ఇతర మౌలిక వసతులు ఏర్పాట్లల్లో భాగంగా పనులు ముమ్మరం చేశారు. టికెట్ కౌంటర్ రూమ్ నిర్మించారు. అక్కడ లైనింగ్ చేస్తున్నారు. ప్లాట్‌ఫారం మీద సిమెంట్ కంకరతో ఫ్లోరింగ్ వేస్తున్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు షెడ్లు నిర్మించారు. పనులన్నీ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించటంతో అందుకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలో రైళ్లు నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా దర్శి ప్రాంత ప్రజల కల నెరవేరనుంది.

ఎన్నికల విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలి


మాట్లాడుతున్న దర్శి నియోజకవర్గ ఈఆర్వో లోకేశ్వరరావు

దర్శి, మార్చి 25 : ఎన్నికల విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని, నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఈఆర్వో ఎంపీఎస్ లోకేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, సెక్టారు అధికారులు పాల్గొన్నారు. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాలతోపాటు బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను ఈఆర్వో లోకేశ్వరరావు, డీఎస్పీ అశోకవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ సుజాత పరిశీలించారు.

ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కులు సాధించుకోవాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు



మాట్లాడుతున్న రంగారావు


కనిగిరి, మార్చి 25 : కార్మికులు ఐక్య పోరాటాలతోనే తమ హక్కులను సాధించుకునేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు చెప్పారు. స్థానిక సుందరయ్య భవనంలో కార్మికుల శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రామికవర్గ దోపిడీపై కార్మికులకు వివరించారు.కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడ్లుగా మార్చటంతో యజమానులు దోపిడీకి తలుపులు తెరిచారన్నారు. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, బ్యాంకులు, ఎల్ఐసీ, బొగ్గు, ఇనుప ఖనిజసంపదలను కారుచౌకగా కట్టబెడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీసీ కేశవరావు, ఎం.రమేష్, జిల్లాకార్యదర్శి కే మాల్యాద్రి, ఆర్ మాలకొండయ్య, జేవీవీ నాయకులు జీ శ్రీనివాసులు, పద్మ, సుఫల, నరేంద్ర పాల్గొన్నారు.

మార్టూరులో వైసీపీ కోటకు బీటలు

- ముస్లిం మైనారిటీ నేతలతో పాటు వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు వైసీపీ నేతలు

మార్టూరు, మార్చి 25 : మార్టూరులో అధికార పార్టీ కోటకు బీటలు పడుతున్నాయి. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరుతు న్నారు. సీనియర్ నాయకుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీగా తెలుగు దేశం పార్టీలో చేరారు. సోమవారం ఉదయం మండలంలోని ఇసుక దర్శిలో గల క్యాంపు కార్యా లయంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూ రి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీ నేత కాకో లు వెంకటేశ్వర్లుతో పాటు మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు గన్నవరం బుడే, మార్టూరు పంచాయతీ మూడవ వార్డు మెంబరు నందూరి ఖాసిం, నాల్గవ వార్డు మెంబరు చందోలు ఖాజావలి, 13వ వార్డు మెంబరు పెన్నుబోయిన భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకుడు అట్లూరి బాబూరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు అనుచ రులతో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతించారు. 4నెలల క్రితం వైసీపీకి చెందిన 11 వార్డు మెంబరు కన్నెగంటి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు.


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లు

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లా డుతూ రాష్ట్రం కోలుకోవాలన్నా, రాష్ట్ర ప్రజానీకం భవిష్యత్తు బాగుపడాలన్నా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావలసిన అవసరం ఏర్పడిందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబుపై నమ్మకంతో పార్టీలో చేరిన వైసీపీ నాయకులను ఆయన అభినందించారు. ఒక ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి వీడ్కోలు పలకడానికి సైనికుల్లాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, జాష్టి సాంబశివరావు, కమ్మ శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నతాళి ఉపసర్పంచ్ చేరిక

జొన్నతాళి ఉపసర్పంచ్, వైసీపీ నేత ఆవుల కోటిరెడ్డి అనుచరులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పలువురు బీసీ నాయకులు పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో శివరాత్రి శ్రీను, శానంపూడి చైతన్య, బంగారు బాబు పాల్గొన్నారు.

ఉగ్ర గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


నాగారప్పమ్మ దేవస్థానంలో గ్రామస్థులతో దారపనేని

పామూరు, మార్చి 25 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బరిలో ఉన్న కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ చెప్పారు. మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ, పోతవరం గ్రామంలో వెలసిఉన్న శ్రీ నాగారప్పమ్మతల్లి దేవస్థానంలో అద్దంకి కొండయ్య, మాలకొండమ్మ దంపతులు, కుమారులు మహేంద్ర, మనోజ్, సోదరుడు గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు అద్దంకి మాల్యాద్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి కొలుపులను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెనికల మాలకొండయ్య, దారపనేని రాజా, గడ్డం వెంకటరత్నం, మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, పోకా నాయుడుబాబు, కొలూరి రహంతుల్లా, వై రాయుడు, మాజీఉపసర్పంచ్ అద్దంకి బాలనాగయ్య, నీటి సంఘం మాజీ అధ్యక్షులు అద్దంకి మాల్యాద్రి, కొండయ్య, మిరియం గురవయ్య, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట


బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

పీసీపల్లి, మార్చి 25 : బీసీలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీయేనని బీసీసెల్ నాయకుడు, నేరేడుపల్లి గ్రామసర్పంచ్ పల్లా మల్లికార్జున్ చెప్పారు. మండలంలోని నేరేడుపల్లిలో టీడీపీ శ్రేణులతో కలిసి సోమవారం బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమపథకాలు అందించడంతో పాటు రాజకీయంగానూ బీసీలకు పదవులు ఇచ్చి ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశంఅని చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో విజయం సాధించి టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు 50 ఏళ్ల వయస్సు కలిగిన వారికి పింఛను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్నపూస బాలక్రిష్ణ, మారెళ్ల మాలకొండయ్య, చాగంరెడ్డి మాలకొండయ్య, ముప్పూరి పెదబ్రహ్మయ్య పాల్గొన్నారు.







డాక్టర్ పెమ్మసాని వర్సెస్ రోశయ్య..





రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బరిలోకి దిగారు. వృత్తిరీత్యా అమెరికాలో ఉంటున్నప్పటికీ డాక్టర్ పెమ్మసాని పుట్టింది, చదివింది, పెరిగింది ఈ లోక్‌సభ స్థానం పరిధిలోనే. గుంటూరులోనే ఆయన విద్యనభ్యసించారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఎంతో కాలంగా ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్నారు. తొలిసారి రాజకీయ అరంగేట్రం చేసినప్పటికీ తన వాక్చాతుర్యంతో ఇప్పటికే ఆయన జనాదరణ పొందారు. ఆయనకు ప్రత్యర్థిగా వైసీపీ తరఫున పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య బరిలోకి దిగారు. తొలుత వైసీపీ తరఫున రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణ బరిలోకి దిగి డాక్టర్ పెమ్మసాని స్పీడును చూసి తట్టుకోలేక రంగంలో నుంచి తప్పుకోవటంతో రోశయ్యను దించారు.

శాసనసభ నియోజకవర్గాలు

గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ (ఎస్సీ), ప్రత్తిపాడు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

నియోజకవర్గ ముఖచిత్రం

గుంటూరు.. ఘనకీర్తి

మొత్తం ఓటర్లు	17,69,225
పురుషులు	9,13,772
మహిళలు	8,55,262
ఇతరులు	191

గుంటూరు విశిష్టత...

మిరప, పత్తి, పొగాకు, పసుపు ఎగుమతులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా పేరొందింది. ఆసియాలో కెల్లా అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులోనే ఉంది. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రధాన రవాణా, విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. స్వాతంత్ర్య సమర యోధులు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య వంటి వారు జన్మించింది ఇక్కడే. భారత స్వాతంత్రోద్యమ సమయంలో 1889లో మహాత్మా గాంధీ వీరితో కలిసి ఇక్కడ ఒక సదస్సు నిర్వహించారు. దేశంలోనే పేరొందిన ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల 1885లో స్థాపించబడింది. భారతదేశంలోనే మొట్టమొదటగా పొగాకు పరిశోధన సంస్థ 1936లో ఇక్కడ ఏర్పాటైంది. ఉమ్మడి రాష్ట్రంలోనే పేరొందిన ప్రభుత్వ వైద్యశాల 1848లో స్థాపించబడింది. ఉండవల్లి గుహలు, మంగళగిరిలోని పానకాలస్వామి ఆలయం, పెదకాకానిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయాలు ఈ ప్రాంతంలో పేరొందాయి. 150 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన పురాతన మున్సిపాలిటీగా గుంటూరు పేరొందింది. 1866లో 25వేల జనాభాతో ఏర్పాటై 1891లో థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా 1917లో ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిగా, 1952లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా, 1960లో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. 1994లో మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. మొట్టమొదటగా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు 1995లో నిర్వహించగా మొదటి మేయర్‌గా టీడీపీ తరఫున డాక్టర్ కొల్లి శారద గెలుపొంది మంచి పేరు తెచ్చుకున్నారు.

ఇక్కడి నుంచి లోక్‌సభకు..

1952లో ఏర్పడిన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి మొదటిసారి ఎస్‌వీఎల్ నరసింహం ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. ఆయన తర్వాత కొత్త రఘురామయ్య ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి వరుస విజయాలు సాధించారు. 1957 నుంచి 1977 వరకు వరుసగా జరిగిన ఐదు ఎన్నికల్లోనూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అంతకుమునుపు 1952లో తెనాలి లోక్‌సభ స్థానం నుంచి కూడా ఆయన గెలుపొందారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో రక్షణ, కార్మిక, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి మంత్రివర్గంలో పౌరసరఫరాలు, సాంకేతికశాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రధాని ఇందిరాగాంధీ మంత్రివర్గంలో న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌక, రవాణా, పర్యాటక శాఖలను నిర్వహించారు.

గుంటూరు అనగానే మొట్టమొదట గుర్తుకు వచ్చేది మిర్చి.. ఆసియాలో కెల్లా అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులోనే ఉంది. అందుకే గుంటూరు ఘాటు అనే నానుడి ప్రజల్లో ఉంది. రాజకీయాల్లోనూ అదే తీరు ఇక్కడ కనపడుతుంది. ఎందరో ఉద్ధండులైన రాజ కీయ నేతలను అందించిన ఘనకీర్తి గుంటూ రుది. స్వాతంత్ర్య పోరాటం నుంచి, ఆ తర్వాత ఇక్కడ మహా మహులు నడయాడారు. నీతివంతమైన రాజకీయాన్ని పాటించిన ఆచార్య ఎన్జీ రంగా ఇక్కడి వారే. కేంద్ర మంత్రిగా అనేక శాఖలను నిర్వహించిన కొత్త రఘురామయ్య ఆదర్శవంతమైన రాజకీయ నేతగా గుర్తింపు పొందారు. అంతే కాకుండా రాష్ట్రంలో ప్రధాన రవాణా, విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. మిరప, పత్తి, పొగాకు, పసుపు ఎగుమతులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా పేరొందింది.



రఘురామయ్య



ఎన్‌జీ రంగా



ఎస్‌వీఎల్ నరసింహం



లాల్‌జాన్‌బాషా



రాయపాటి

- రాజకీయాల్లో ఉద్దండులను అందించిన గుంటూరు జిల్లా
- దేశానికి ఉత్తమ పార్లమెంటేరియన్‌ను అందించిన ఘనత ఈ నియోజకవర్గానిదే...
- సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కిన ఆచార్య ఎన్జీ రంగా
- కేంద్ర మంత్రిగా అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన కొత్త రఘురామయ్య
- ఆసియాలోనే అతి పెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులో..


గుంటూరు, మార్చి25(ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానం అనగానే మొట్టమొదటగా గుర్తుకొచ్చేది ఆచార్య ఎన్జీ రంగానే అని చెప్పవచ్చు. లోక్‌సభ, రాజ్యసభలోనూ 60 ఏళ్ళ పాటు కొనసాగి రైతుల పక్షాన పోరాడిన ఆచార్య రంగాజీని దేశానికి అందించిన ఘనత గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానిదే సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా ఆయన ఎక్కటం ద్వారా ఈ ఘనత వహించారు. ఆరు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైనప్పటికీ ఎలాంటి పదవులు చేపట్టకుండా ప్రతిష్టాత్మక, నీతివంతమైన రాజకీయాన్ని పాటించిన ఖ్యాతి ఆచార్య రంగాదే. రైతులకు ఆయన అందించిన సేవలకు గుర్తుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టింది. 1996లో ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీగా రూపాంతరం చెందిన ఈ విశ్వవిద్యాలయం భారతదేశంలోనే వ్యవసాయ విద్యలో అగ్రగామిగా నిలిచింది.

ఆచార్య ఎన్జీ రంగా..

1980, 84, 89లో జరిగిన ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆచార్య ఎన్జీ రంగా గెలుపొందారు. 1930 నుంచి 1991వరకు కొద్దికాలం తప్పితే నిరాఘాటంగా పార్లమెంట్‌లో 60 ఏళ్ల ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. 1952, 1965లలో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంట్ సభలకు, 1980లో ఐక్యరాజ్య సమితి సమావేశానికి భారత ప్రతినిధిగా హాజరయ్యారు. కురువృద్ధుడు, సీనియర్ పార్లమెంటేరియన్ ఆచార్య ఎన్జీ రంగాను ఓడించి చట్టసభలో అడుగు పెట్టే అవకాశం బాషాకు నందమూరి తారక రామారావు కల్పించారు. తెలుగుదేశం ఆవిర్భావం అనంతరం తొట్టతొలుతగా ఈ నియోజకవర్గం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఎస్‌ఎం లాల్ జాన్‌బాషాకు లభించింది. 1991లో ఆయన విజయం సాధించారు. రంగా ఎంతోమందిని ప్రజానాయకులుగా తీర్చిదిద్దారు. గౌతు లచ్చన్న, పాతూరి రాజగోపాలనాయుడు, జి.మునిరత్నం నాయుడు, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, యడ్లపాటి వెంకటరావు, కందుల ఓబులురెడ్డి, ప్రగడ కోటయ్య, సుంకర సత్యన్నారాయణ, గోగినేని నాగేశ్వరరావు తదితరులు రంగా శిష్యరికం నుంచి వచ్చిన వారే.

ఆ తరువాత..

తరువాత తరంలో సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా పేరొందిన రాయపాటి సాంబశివరావు 1996, 98,లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇక్కడ గెలుపొందారు. 1999లో టీడీపీ తరఫున ఈ నియోజకవర్గం నుంచి గెలిచే అవకాశం యంపరాల వెంకటేశ్వరరావు (వైవీ రావు)కు దక్కింది. ఆ తర్వాత మళ్లీ రెండు పర్యాయాలు 2004, 2009లో రాయపాటి గెలిచారు. 2014, 2019లో ఈ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్‌కు దక్కింది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తున్న జయదేవ్ తిరిగి పోటీచేసే అవకాశం ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలతో రాజకీయాల నుంచి వైదొలిగారు.



వైవీరావు



జయదేవ్

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

కమ్మ	2,02,769
రెడ్డి	1,05,866
ముస్లిం	1,87,080
కాపు	2,07,552
మాదిగ	1,58,242
మాల	2,03,917
ఆర్యవైశ్య	81,375
యాదవ	1,05,117
వడ్డెర	30,485
గౌడ	40,252
రజక	43,340
ముదిరాజు	4,024
ఎరుకుల	16,852
నాయిబ్రాహ్మణ	4,787
యానాది	9,082
బ్రాహ్మణ	35, 854
వెలమలు	1,000
క్షత్రియ	3,000
క్రిస్టియన్లు	6,149
దూదేకుల	3,472
పద్మశాలి	56,672
మంగళి	15,398
కుమ్మరి	16,769
ఉప్పర	14,458
బోయలు	1453
సూర్యబలిజ	2,414
కృష్ణ బలిజ	2,457
పెరిక	1,343
మేదర	2,701
జంగం	500
లంబాడి	3,598
చెంచు	141
బుడబుక్కలు	500
ఇతరులు	32, 121

పునర్విభజనలో అనేక మార్పులు..

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం 2007లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన మూలంగా అనేక మార్పులకు గురైంది. అంతకుమునుపు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు శాసనసభ నియోజకవర్గాలు నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గంలోకి వెళ్ళిపోయాయి. గతంలో ఉన్న తెనాలి లోక్‌సభ నియోజకవర్గం రద్దయి దాని పరిధిలో ఉన్న తెనాలి, మంగళగిరి శాసనసభ నియోజకవర్గాలు గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలోకి వచ్చాయి. 2022లో జరిగిన జిల్లాల పునర్విభజనలో గుంటూరు లోక్‌సభ స్థానం ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. గుంటూరు జిల్లాగా కొనసాగుతున్న ఈ లోక్‌సభ స్థానంలో 18 మండలాలు ఉన్నాయి.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	ఎస్‌వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	ఎన్‌జీ రంగా	కేఎల్‌పీ	17517
1957	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్‌వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	58955
1962	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్‌వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	99942
1967	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్‌వీఎల్ రావు	ఇండిపెండెంట్	117032
1971	కె రఘురామయ్య	కాంగ్రెస్	జూపూడి యజ్ఞనారాయణ	బీజేఎస్	191018
1977	కె రఘురామయ్య	కాంగ్రెస్	కె సదాశివరావు	బీఎల్‌డీ	85529
1980	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	కె సదాశివరావు	జనతా ఎస్	157334
1984	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	మొవ్వ చంద్రశేఖరరావు	టీడీపీ	11894
1989	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	ఎంఎస్‌ఎస్ కోటేశ్వరరావు	టీడీపీ	65013
1991	లాల్‌జాన్‌బాషా	టీడీపీ	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	14744
1996	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	ఎస్‌ఎం లాల్‌జాన్‌బాషా	టీడీపీ	57,347
1998	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	ఎస్‌ఎం లాల్‌జాన్‌బాషా	టీడీపీ	48,499
1999	యంపరాల వెంకటేశ్వరరావు	టీడీపీ	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	40330
2004	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	వైవీ రావు	టీడీపీ	129792
2009	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	మాదల రాజేంద్ర	టీడీపీ	39355
2014	గల్లా జయదేవ్	టీడీపీ	వల్లభనేని బాలశౌరి	వైసీపీ	69111
2019	గల్లా జయదేవ్	టీడీపీ	మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి	వైసీపీ	4205

కోడ్ కాదని.. ఓట్ల వేట

- యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న వైసీపీ
- వలంటీర్లకు తాయిలాలు ఇచ్చి మరీ ప్రచారం
- సెల్‌ఫోన్లకు సీఎం జగన్ వాయిస్‌తో సందేశాలు
- ఏ పార్టీకి ఓటు వేస్తారంటూ సర్వే ముసుగులో ఆరాపై అనుమానాలు
- ప్రతిపక్షాలకే ఎన్నికల నిబంధనలు అన్నట్లుగా అధికారుల తీరు



గుంటూరు, మార్చి 25: ఎన్నికల కోడ్ వచ్చి వారం అవుతుంది.. అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్నా.. అధికారులు మారలేదు. ఎన్నికల నిబంధనలు ప్రతిపక్షాలకే అన్నట్లుగా అధికార యంత్రాంగం ఉందన్న విమర్శలు వస్తున్నాయి. వలంటీర్లతో ప్రచారాలు, సీఎం జగన్ ఫొటోల తొలగించకపోవడం, సీఎం వాయిస్‌తో ప్రజల సెల్‌ఫోన్లకు సందేశాలు.. ఇలా కోడ్ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు వలంటీర్లతో ప్రచార కార్యక్రమాలు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలు షరామామూలుగానే నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి కార్యాలయంలో వలంటీర్లతో మూడు రోజులుగా సమావేశాలు నిర్వహించినా అధికారులు పట్టించుకోలేదు. పైగా వలంటీర్లతో గ్రామాల్లో కులాల వారీగా వివరాలు సేకరించాలని వలంటీర్లను ఆ అభ్యర్థి ప్రలోభాలకు గురి చేస్తున్నారని టీడీపీ నేతలు రుజువు చేసినా అధికారులు కనీసం పరిశీలన కూడా చేయలేదు. ఈ క్రమంలో తమపై దాడి చేశారని ఏకంగా ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుతోపాటు కూటమి పార్టీల నాయకులు స్వయంగా ఎస్పీకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసి, వలంటీర్‌లు ఉన్న ఫొటోలు, వీడియోలు అందించారు. సత్తెనపల్లిలో జగన్ స్టిక్కర్ ఉన్న చీరలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కోడ్‌కు విరుద్ధంగా శుక్రవారం గుంటూరు మిర్చి యార్డులో గుంటూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి కిలారు రోశయ్య, గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా, ప్రత్తిపాడు అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు ఎన్నికల ప్రచారం చేశారు. మిర్చియార్డులో వైసీపీ అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు కట్టినా అధికారులు పట్టించుకోలేదు. ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. అయినా అధికారులు అడ్డు కోవడంలేదు. మరోవైపు వారం రోజులుగా సీఎం జగన్ వాయిస్‌తో 'మీ బిడ్డ ఎవరితోనూ పొత్తుపెట్టుకోడు.. నమ్ముకున్నది దేవుడిని, మంచి చేసిన ప్రజలని.. కుట్రలు, కుతంత్రాలతో జెండాలు జత కట్టడమే వారి అజెండా.. మీ ఇంటిలో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే తోడుగా ఉండండి..' అంటూ 29 సెకండ్ల నిడివితో 8038462583 నెంబర్‌తో వాయిస్ సందేశాలు ఓటర్లకు పంపుతున్నారు. 6302994851 నెంబర్‌తో నరసరావుపేట ఓటర్ల నుంచి ఎవరికి ఓటు వేస్తారు అంటూ ప్రశ్నలతో సర్వే చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా చెబితే ఎక్కడ ఓట్లు తొలగిస్తారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇటువంటి సర్వేలు నిబంధనలకు విరుద్ధం అయినా యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇక వలంటీర్లు యథేచ్ఛగా వైసీపీ నేతలతో అంటకాగుతున్నారు. వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా ఏమాత్రం లెక్క చేయడంలేదు. పైగా మరింత విస్తృతంగా ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ అధికారులు ఇటువంటి కోడ్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు కోరుతున్నారు.

శింగరకొండ.. దేదీప్యమానం

- వైభవంగా 69వ వార్షిక తిరునాళ్ల
- పోటెత్తిన భక్తజనం

అద్దంకి, మార్చి25: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి 69వ వార్షిక తిరునాళ్లతో సోమవారం శింగరకొండ క్షేత్రం విద్యుత్ వెలుగుల మధ్య దేదీప్యమానంగా మారింది. ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయంతో పాటు సామాజిక వర్గాల అన్నదాన సత్రాలను విద్యుత్ దీపాలు అలంకరించారు. మెట్ల మార్గానికి కూడా విద్యుత్ లైట్లు ఏర్పాటుచేశారు. గతంలో పెద్ద సంఖ్యలో విద్యుత్ ప్రభల ఏర్పాటు జరగగా, ఈ ఏడాది మాత్రం ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పలువురు విద్యుత్ ప్రభల ఏర్పాటును విరమించుకున్నారు. ఇక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం రాతి మండపం నిర్మాణ పనులు కూడా ఆలస్యం కావటం భక్తులను మరింత నిరుత్సాహానికి గురిచేసింది. రాతి మండపం నిర్మాణంలో ఉండటంతో బాలాలయంలో స్వామి దర్శనం ఏర్పాటుచేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీళ్ళ ప్యాకెట్‌లు భక్తులకు పంపిణీ చేశారు. అన్ని అన్నదాన సత్రాలతో పాటు శ్రీరామ జీవన సంఘం, విద్యుత్ భవన్‌ల వద్ద భక్తులకు సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అద్దంకి, ఒంగోలు, పొదిలి, నర్సరావుపేట, వినుకొండ డిపోల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపారు. పోలీస్ లు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. విద్యుత్ ప్రభ ఒక్కటే కావటంతో ముందస్తుగా అంచానా వేసుకున్న 750 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది కాకుండా సుమారు 600 మందికే పరిమితం చేశారు. గతం కంటే దేవాలయం పరిసర ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని ఎక్కువగా కేటాయించారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను మేదరమెట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా మళ్లించారు. అద్దంకి పట్టణంలో భవాని సెంటర్‌లో మాత్రం వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(మంగళవారం)
సహరీ (ఉదయం) 4.51 (బుధవారం)



విద్యుత్ వెలుగుల్లో శింగరకొండ

కందుకూరులో మహిళ దారుణ హత్య

● భర్తే కొట్టి చంపేశాడని అనుమానం ● పరారీలో నిందితుడు



వనజాక్షి మృతదేహం


వనజాక్షి(ఫైల్)

కందుకూరు, మార్చి 25 : నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలో ఓ మహిళ సోమవారం మధ్యాహ్నం దారుణహత్యకు గురైంది. స్థానిక పామూరు రోడ్డు సర్కిల్ సమీపంలో గాయత్రీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న చిమటా వనజాక్షి (27) హత్యకు గురైంది. వనజాక్షి శరీరమంతా గాయాలతో రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉండగా సోమవారం సాయంత్రం గుర్తించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వనజాక్షి భర్త శివకృష్ణ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉండటంతో భర్తే ఆమెను హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. వనజాక్షి తలకు, చేతికి బలమైన గాయాలు ఉండటం, తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందటంతో రోకలి బండతో బలంగా కొట్టినట్లు భావిస్తున్నారు. ఇంటిప్రధాన ద్వారం వద్దే ఆమె కుప్పకూలిపోయి మృతిచెందగా తలుపు కూడా వేయకుండా హంతకుడు పరారయ్యాడు. మృతురాలు వనజాక్షిది శ్రీకాకుళం సమీపంలోని కోటబొమ్మాళి కాగా, పన్నెండేళ్ల క్రితం శివకృష్ణతో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు. కాగా కొన్నేళ్లగా పావని బ్యూటీపార్లర్ పేరుతో ఇంటివద్దే బ్యూటీపార్లర్ నడుపుతున్న వనజాక్షిని భర్తే హతమార్చాడన్న వార్త పట్టణంలో సంచలనం రేపింది. పట్టణ సీఐ హాఫీజ్ మృతదేహాన్ని సందర్శించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు టూరు షెడ్యూల్ మార్పు

- 31న మార్కాపురంలో సభకే పరిమితం



ఒంగోలు, మార్చి 25 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన షెడ్యూల్‌లో మార్పు జరిగింది. తొలుత ఈనెల 31న జిల్లాలోని మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలలో ప్రజాగళం పేరుతో పర్యటించేలా నిర్ణయించారు. అయితే తాజా ఆ షెడ్యూల్‌ను మార్పు చేశారు. ప్రస్తుతం జిల్లా నేతలకు అధిష్ఠానం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 31న చంద్రబాబు కార్యక్రమం మార్కాపురం వరకే పరిమితం కానుంది. ఆ రోజున ఉదయం నెల్లూరు జిల్లా కావలిలో జరిగే సభలో పాల్గొనే చంద్రబాబు అనంతరం హెలికాప్టర్‌లో మార్కాపురం చేరుకొని అక్కడ జరిగే సభలో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి బాపట్ల జిల్లా వెళ్తారు. ఆ జిల్లాలోని రేపల్లే, బాపట్లలో జరిగే సభల్లో పాల్గొంటారు.

మద్దిశెట్టి వర్గీయుడిపై దాడి

బూచేపల్లి అనుయాయులు దారికాచి కొట్టారు..!

తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చేరిన బాధితుడు

కేసు నమోదు చేయకుండా ముండ్లమూరు ఎస్ఐ నిర్లక్ష్యం


బాధితుడు శ్రీనివాసుల రెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 25 : మద్దిశెట్టి వేణుగోపాల్ వర్గీయునిపై మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వర్గీయులు దాడి చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి ముండ్లమూరులో చోటు చేసుకుంది. బాధితుడు పసుపుగల్లుకు చెందిన బిజ్జం శ్రీనివాసులరెడ్డి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. పసుపుగల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తనపై మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి వర్గీయులు దారికాచి దాడి చేసినట్లు బాధితుడు శ్రీనివాసులరెడ్డి వాపోయారు. గతనెల 11వ తేదీన ఉల్లగల్లు వద్ద తాను ట్రాక్టర్ నడుపుతూ వెళుతుంగా తప్పెట నాగభూషణం అనే వ్యక్తికి తగిలిందన్నారు అయితే అందుకు సంబంధించి నష్టపరిహారంగా తన వద్ద రూ.60వేలు డబ్బులు, తన బైక్, సెల్‌ఫోన్ కూడా తీసుకున్నారని బాధితుడు తెలిపారు. కాగా తన వద్ద నుంచి తీసుకున్న బైక్, సెల్ ఇస్తామని ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ నమ్మకంగా పిలిపించగా ముండ్లమూరు వెళ్తున్నానని పేర్కొన్నారు. అయితే దారికాచి బూచేపల్లి వర్గానికి చెందిన రెడ్డినగర్‌కు చెందిన రమణారెడ్డి, ఉల్లగల్లుకు చెందిన గొంది వెంకట అప్పిరెడ్డి, జనకాల పిచ్చయ్య, తప్పెట నాగరాజు, కత్తి నాగరాజులు దాడిచేశారని వాపోయారు. అలాగే వెంటపడి చంపబోయారని తెలిపారు. ఇదే విషయమై తాను ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి ఎస్ఐ ఆంజనేయులు తన ఫిర్యాదు తీసుకోకపోగా తనను బెదిరింపులకు గురిచేసి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని తెలిపారు. అంతేకాకుండా దాడికి ఎస్ఐ కూడా సహకరించారని తెలిపారు. ఆదివారం జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన తాను దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం చేరగా, రాత్రి వరకు అక్కడే వైద్యం అందించిన వైద్యులు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం సోమవారం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. ఇప్పటికీ తనను అక్కడి నేతలు బెదిరిస్తున్నారని, తనపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని ఆయన కోరారు. కాగా బాధితుడికి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించనున్నారు.

ఎస్పీ కార్యాలయానికి హోంగార్డు సరెండర్

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన


త్రిపురాంతకం, మార్చి 25 : వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హోంగార్డు మందా కొండారెడ్డిని ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు త్రిపురాంతకం సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మందా కొండారెడ్డి ఇటీవల మార్కాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు నిర్వహించిన ఆత్మీయ సమావేశం, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పరిచయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన త్రిపురాంతకం సీఐ సుబ్బారావు హోంగార్డుపై ఉన్నతాధికారులకు రిపోర్టు రాశారు. ఎస్పీ కార్యాలయానికి హోంగార్డును రిటర్న్ చేసినట్లు తెలిపారు.

పేదల బియ్యం పక్కదారి

రేషన్ దుకాణం నుంచి మిల్లులకు తరలింపు

రీసైక్లింగ్ చేసి చెన్నై, బెంగళూర్లు, ఇతర ప్రాంతాలకు ఎగుమతి

మాఫియాగా మారి దోచుకుంటున్న వైసీపీ నాయకులు


పట్టుబడిన రేషన్ బియ్యం

త్రిపురాంతకం, మార్చి 25 : పౌరసరఫరాల బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు మాఫియా అవతారం ఎత్తి పేదల బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమార్జనకు తెగబడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో రేషన్ ద్వారా ఇచ్చే పేదల బియ్యాన్ని సేకరించి స్థానికంగా కొన్ని రైస్ మిల్లులను అద్దెకు తీసుకుని వాటిలో రీసైక్లింగ్ చేసి చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, కార్డుదారులకు కిలోకు రూ. 10నుంచి రూ.12 చొప్పున చెల్లించి వారికి ఇవ్వాల్సిన బియ్యాన్ని మధ్యవర్తుల ద్వారా ఆయా మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది అధికారుల దాడులు జరుగుతున్నాయన్న సమాచారంతో సుమారు 250 బస్తాల బియ్యాన్ని త్రిపురాంతకం సమీపంలోని నాసరయ్య మఠంలో నిల్వచేశారు. సమాచారం అందుకున్న అధికారులు దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా అడపాదడపా దాడులు నిర్వహించి చిన్న చిన్న ఆటోలలో, మినీ లారీలలో తరలించే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటనలు జరిగాయి. గత సెప్టెంబర్‌లో మండలంలోని రాజుపాలెంలో రైస్ మిల్లులపై దాడులు జరిగాయి. ఈ దాడులలో సుమారు 36.90 టన్నుల బియ్యాన్ని అధికారుల స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారం తర్వాత మరోసారి జరిగిన దాడులలో మరొక మిల్లులో సుమారు 125 బస్తాల రేషన్‌బియ్యం పట్టుబడ్డాయి.

ఎంపీ అభ్యర్థి మాగుంటే..!

ఒంగోలు లోక్‌సభ నుంచి మళ్లీ పోటీ

మాట్లాడి ఒప్పించిన టీడీపీ అధినేత చంద్రబాబు

పార్టీ నిర్ణయాన్ని స్వాగతించిన రాఘవరెడ్డి

దర్శిపై కొనసాగుతున్న సస్పెన్స్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వచ్చే ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరు ఖరారైంది. తన కుమారుడు రాఘవరెడ్డిని పోటీలో ఉంచబోతున్నట్లు ఏడాదిన్నర క్రితమే ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వివిధ కారణాలతో ఆయన వైసీపీకి రాజీనామా చేసిన రోజు, టీడీపీలో చేరిన రోజు కూడా తన కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. టీడీపీ నాయకత్వంకు ఆ మేరకు సమాచారం ఇచ్చే ఆయన రాఘవరెడ్డి పేరు ప్రకటించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఒంగోలు లోక్‌సభ పరిధిలోని టీడీపీ శ్రేణులు నుంచి అభిప్రాయ సేకరణ సర్వే చేశారు. తొలుత రాఘవరెడ్డి అభ్యర్థిగా ఆ తర్వాత శ్రీనివాసులరెడ్డి అభ్యర్థిగా ప్రజాభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆపై బీజేపీతో సీట్ల ఒప్పందం పైన టీడీపీ ఒక అవగాహనకు రావటంతోపాటు అభ్యర్థుల ఎంపికపైన తర్జనభర్జనలు పడ్డారు. అదేసమయంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు పరిణామాలు చోటుచేసుకున్నాయి. వీటన్నింటికి తోడు భవిష్యత్తులో కేంద్రంతో వివిధ అంశాలపై రాయబారాలు జరిపేందుకు లోక్‌సభ సభ్యులుగా పార్టీలో కొందరు సీనియర్లు, ఢిల్లీ రాజకీయాల్లో పట్టు ఉన్న వారు పార్టీ లోక్‌సభ సభ్యులుగా ఉంటే మంచిదని టీడీపీ భావించింది. ఇప్పటికే ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల్లో యువకులు, అందునా కొత్తవారు ఎక్కువగా ఉన్నారు. దీంతో చంద్రబాబు ప్రత్యేక అధ్యాయనం చేసి శ్రీనివాసులరెడ్డిని రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ మేరకు ఆదివారం సాయంత్రం చంద్రబాబు ఎంపీ మాగుంటకు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. అయితే తన కుమారుడు రాఘవరెడ్డిని రంగంలో దింపాలనే నిర్ణయం కుటుంబ నిర్ణయమని మాగుంట చెప్పగా పార్టీ నిర్ణయం వారికి తెలిపి ఒప్పించాలని చంద్రబాబు సూచించారు. దీంతో ఆదివారం రాత్రి మిగిలిన కుటుంబ సభ్యులతో మాట్లాడిన మాగుంట ఈ పర్యాయం ఒంగోలు నుంచి ఆయనే పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. ప్రచారంలో ఉన్న కుమారుడు పరిస్థితి అర్థం చేసుకొని తన తండ్రి పోటీలో ఉంటారని ప్రకటించారు.

ఒంగోలు లోక్‌సభ నుంచి టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డినే పోటీచేయనున్నారు. ఆ మేరకు సోమవారం అధికారిక నిర్ణయం జరిగిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబు వివిధ అంశాలను పరిగణనలోకి పెట్టుకొని పోటీచేయాలని మాగుంటకు వివరించగా అందుకు ఆయన అంగీకరించారు. ఇప్పటికే ప్రచారంలో ఉన్న ఆయన కుమారుడు రాఘవరెడ్డి కూడా పార్టీ సూచనలను గౌరవిస్తూ తన తండ్రి శ్రీనివాసులరెడ్డి పోటీలో ఉండబోతున్నారని ప్రకటించారు. అయితే దర్శి అసెంబ్లీ అభ్యర్థి ఎంపికలో టీడీపీ అధిష్ఠానం అనుసరిస్తున్న తడబాటు ధోరణిపై ఆ పార్టీ శ్రేణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.


మాగుంట

దర్శిపై కొనసాగుతున్న ఉత్కంఠ

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి ఎంపిక కూడా పూర్తికావటంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ కూటమి దర్శి అసెంబ్లీ అభ్యర్థినే ప్రకటించాల్సి ఉంది. ఇక్కడ అభ్యర్థి ఎంపికపై జాప్యం జరగటం పట్ల నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తొలుత జనసేనకు సీటు కేటాయించటంతో గరికపాటి వెంకట్ వచ్చి పనిచేయటం ప్రారంభించారు. టీడీపీకి ఆ స్థానం దక్కటంతో టికెట్ ఆశించే వారి సంఖ్య పెరిగింది. కొంతకాలంగా అక్కడ పనిచేస్తున్న వెంకట్‌కే అవకాశం ఇవ్వాలని జనసేన నేత పవన్‌కళ్యాణ్ చంద్రబాబుకు సిఫార్సు చేసినట్లు తెలిసింది. దీనికి తోడు టీడీపీలో ఉన్న వారితో పాటు వైసీపీలో ఉన్న మాజీ మంత్రి పేరు పరిశీలనలకు వచ్చింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అనుచరులు ఆయన పార్టీలో చేరినట్లే, టికెట్ వచ్చినట్లే ప్రచారం చేస్తున్నారు. కాగా ఆయన గాని ఆయన కుటుంబ సభ్యులు కానీ నోరు మెదపకపోవటం విశేషం. టీడీపీ యువనేత నారా లోకేష్ కూడా పార్టీ మారిన వారు వద్దని కొత్త వారు కావాలనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో ఫోన్ సర్వే నిర్వహించిన టీడీపీ తాజాగా గరికపాటి వెంకట్, గొట్టిపాటి లక్ష్మీ, శిద్దా రాఘవరావు, హర్షిణీ రవికుమార్‌లపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. వైసీపీ అభ్యర్థి ఆర్థికంగా బలవంతుడు కావటంతో ఆ విషయాన్ని, జనసేన సిఫార్సును ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తేల్చుకోలేక అధిష్ఠానం సతమతమవుతున్నట్లు తెలిసింది. అభ్యర్థి ఎంపికలో టీడీపీ అధిష్ఠానం అనుసరిస్తున్న వ్యవహారం ఆ పార్టీ జిల్లా నాయకులు, నియోజకవర్గ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నీటి కోసం నిరసన

రోడ్డెక్కిన ఐనముక్కల ఎస్సీ కాలనీవాసులు

కేజీ రోడ్డుపై ఆందోళనతో నిలిచిన వాహనరాకపోకలు

పెద్దదోర్నాల, మార్చి 25 : నీటి సమస్యను పరిష్కరించాలంటూ మండలంలోని ఐనముక్కల గ్రామం ఎస్సీకాలనీ వాసులు సోమవారం ఆందోళనకు దిగారు. ఖాళీబిందెలతో కర్నూలు- గుంటూరు జాతీయరహదారిపై నిరసన తెలిపారు. గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అంకమరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో మాట్లాడారు. కాలనీలో బోరుబావులున్నాయని కొంత లోతుగా తవ్వితే నీళ్ల వస్తాయన్నారు. రెండు నెలలుగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ట్యాంకర్‌తో ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు మొక్కుబడిగా తెస్తే ఎలా సరిపోతాయని గగ్గోలుపెట్టారు. దీంతో ఎస్ఐ పంచాయతీ కార్యదర్శితో ఫోన్‌లో విషయం చెప్పారు. గ్రామ సర్పంచి హారిక భర్త కృపాకర్ వచ్చి కాలనీవాసులతో మాట్లాడారు. ప్రస్తుతం ట్యాంకరుతో నీటిని సరఫరా చేస్తామని రెండు రోజుల్లో బోరుబావిని తవ్వించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. అనంతరం వాహన రాకపోకలు సాగాయి.

అన్ని గ్రామాల్లో సమస్య తీవ్రం

మండలంలో రోజూ ఏదో ఒక గ్రామంలో నీటి సమస్యతో ప్రజలు రోడ్డెక్కుతున్నారు. వేసవి ఎండలు ముందుతుండటంతోపాటు వర్షాభావంతో నీటి వనరులు అడుగంటిపోయాయి. గతంలో తవ్విన బోర్లు తక్కువ లోతులో ఉండటంతో నీరు లభ్యం కావడం లేదు. ప్రస్తుతం వెయ్యి అడుగుల లోతు తవ్వితేనే కొన్నిచోట్ల నీటి జాడ కనిపిస్తోంది. పైగా ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో గ్రామాల్లో పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో ప్రతి గ్రామంలోనూ నీటి సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా చట్టుతాండా, చింతల అగ్రహారం, బొమ్మలాపురం వంటి గ్రామాలతో పాటు దోర్నాలలోనే అన్ని వీధుల్లో ప్రజలు నీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఏ వీధిలో నీటి సమస్య ఎక్కువగా ఉంటే ఆ వీధి వాసులు బిందెలు పట్టుకుని పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగితేనే నీటి ట్యాంకర్ పంపుతున్నారు. దీంతో ప్రతి కాలనీవాసులు ఆందోళనబాటనే ఎన్నుకున్నారు. కానీ ఎన్నాళ్ల ఇలా. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే మూడు నెలలు పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈసారి ఎండలు మరింత ఎక్కువగా ఉంటాయన్న సమాచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


కేజీ రోడ్డుపై ఆందోళన చేస్తున్న ప్రజలు

బెదిరించినా.. బేఖాతరు

గిద్దలూరులో టీడీపీలోకి భారీగా పెరిగిన వలసలు

ఫలించని వైసీపీ హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ బెదిరింపు రాజకీయాల వ్యూహం బెడిసికొడుతోంది. అందుకు గిద్దలూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలే సాక్ష్యంగా నిలిచాయి. తెలుగుదేశం పార్టీలోకి పోతున్న వలసలకు బ్రేక్ వేసేందుకు హత్యా రాజకీయాలకు వైసీపీ తెరలేపిన విషయం తెలిసిందే. అయినా అక్కడ వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు తగ్గకపోగా, రెట్టింపయ్యాయి. సోమవారం రెండు మండలాల్లో, ఆదివారం ఒక మండలంలో వైసీపీకి ముఖ్యులు, ప్రజాప్రతినిధులు, కొన్ని సామాజికవర్గాలకు చెందిన ప్రముఖులు పోలోమని టీడీపీలో చేరడం విశేషం. వారందరూ టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గతేడాదిన్నర నుంచి నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు జరుగుతున్నాయి. వైసీపీ అభ్యర్థి ఎంపికలో తకరారు తర్వాత అవి మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో వలసల నివారణకు బెదిరింపు రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. పరమేశ్వరనగర్‌లో ఏడాదిన్నర క్రితం టీడీపీలో చేరిన గిరిజన యువకుడు మునయ్యను హత్య చేశారు. దీంతో టీడీపీలోకి వలసలు రాకుండా బ్రేక్ పడుతుందని చాలామంది భావించారు. కానీ అనూహ్యంగా వలసలు పెరిగాయి. సోమవారం కంభం, అర్ధవీడు మండలాల్లో యాదవ, గాండ్ల, కాపు, ఆర్యవైశ్య సామాజికవర్గాల నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. గ్రూపులు గ్రూపులుగా, కుటుంబాలకు కుటుంబాలు నిర్ణయాలు తీసుకుని టీడీపీలో చేరుతున్నారు. యాదవ సామాజికవర్గానికి చెందిన కంభం జడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, ఆమె భర్త, కందులాపురం మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసీపీలోని వారి అనుచరులతోపాటు యాదవ సామాజికవర్గంలోని వారి బంధుగణం, ఇతర ప్రముఖులు కూడా అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కంభంలో ఆర్యవైశ్య సామాజికవర్గంలో కీలక పాత్ర పోషించే ప్రముఖులు కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పారు. బిజ్జాల కిషోర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల చేరిక జరిగింది. ఇదే మండంలోని తురిమెళ్ల సర్పంచ్ సుభద్ర, వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారితోపాటు గ్రామంలోని గాండ్ల సామాజికవర్గాలకు చెందిన వారు టీడీపీలో చేరడం విశేషం. ఇక అర్ధవీడు ఎంపీపీ ఎం వెంకట్రావుతోపాటు పెద్దసంఖ్యలో ఆయన అనుచరులు, కాపు సామాజికవర్గాల వారు టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. దివంగత టీడీపీ నేత శ్రీరాములరెడ్డి అల్లుడైన వెంకట్రావు ఎంపీపీగా వైసీపీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. మండలంలో కాపు సామాజికవర్గంలోని వివిధ తెగల వారిని సమన్వయం చేస్తూ ముందుకు నడుపుతుంటారు. ఈ మండలంలోని మాగుటూరు సర్పంచ్ ఈశ్వరీబాయ్‌తోపాటు జయరామ్‌నాయక్, వారితోపాటు గిరిజన కుటుంబాల వారు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. అలాగే మావోయిస్ట్‌గా ఆ ప్రాంత ప్రజలకు తెలిసి, ఆ తర్వాత ప్రభుత్వానికి లొంగిపోయి, ప్రస్తుతం వైసీపీలో ఉన్న పాండురంగారెడ్డి అలియాస్ సాగర్ ఆయన అనుచరులు టీడీపీలోకి చేరి అశోక్‌రెడ్డికి మద్దతు పలికారు. ఆదివారం రాత్రి పొద్దుపోయాక రాచర్ల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు లలితకుమారితోపాటు చోళ్లవీడు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, విద్యా కమిటీ చైర్మన్, ఆ గ్రామంలోని మూడు వార్డుల సభ్యులు వైసీపీ నుంచి అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరూ కాపు సామాజికవర్గానికి చెందిన వారు. గిరిజన యువకుడు మునయ్య హత్య అనంతరం పార్టీ, ప్రభుత్వ పదవులను వదులుకుని ఆయా సామాజికవర్గాల ప్రముఖులు ఇలా వైసీపీ నుంచి టీడీపీలో చేరుతుండడంతో హత్య రాజకీయా లకు బెదరబోమనే సంకేతాన్ని వారిచ్చినట్లు ప్రస్ఫుటమవుతోంది.


పార్టీలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కులు సాధించుకోవాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు



మాట్లాడుతున్న రంగారావు

కనిగిరి, మార్చి 25 : కార్మికులు ఐక్య పోరాటాలతోనే తమ హక్కులను సాధించుకునేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు చెప్పారు. స్థానిక సుందరయ్య భవనంలో కార్మికుల శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రామికవర్గ దోపిడీపై కార్మికులకు వివరించారు. కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడ్లుగా మార్చటంతో యజమానులు దోపిడీకి తలుపులు తెరిచారన్నారు. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, బ్యాంకులు, ఎల్ఐసీ, బొగ్గు, ఇనుప ఖనిజసంపదలను కారుచౌకగా కట్టబెడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీసీ కేశవరావు, ఎం.రమేష్, జిల్లాకార్యదర్శి కే మాల్యాద్రి, ఆర్ మాలకొండయ్య, జేవీవీ నాయకులు జీ శ్రీనివాసులు, పద్మ, సుఫల, నరేంద్ర పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడిని గుర్తించిన పోలీసులు

కనిగిరి, మార్చి 25 : స్కూల్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన బాలుడిని పోలీసులు గుర్తించి వారి తల్లితండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన ఉప్పు పెదవెంగయ్య కుమారుడు వెంగళరాయుడు మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం స్కూల్‌కు అని వెళ్లిన ఇంటికి రాకపోవటంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడి స్నేహితుడు ఇచ్చిన సమాచారంతో వెంగళరాయుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి పొదిలి డిపోలో బాలుడిని చూసిన కానిస్టేబుల్ బాషా గుర్తించి కనిగిరి తీసుకెళ్లారు. బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఎస్ త్యాగరాజు వారి తల్లితండ్రులకు అప్పగించారు.

వడివడిగా దర్శి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు

• ఈ నెలాఖరులోపు పనులన్నీ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశం • ఏప్రిల్‌లో రైళ్లు నడిపేందుకు సన్నాహాలు


దర్శి వద్ద నూతనంగా నిర్మిస్తున్న రైల్వేస్టేషన్


రైల్వేస్టేషన్ వద్ద చేస్తున్న లైనింగ్ పనులు

దర్శి, మార్చి 25 : దర్శి పట్టణ సమీపంలో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు వడివడిగా జరుగుతున్నాయి. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను నిర్మాణంలో భాగంగా తొలిదశలో దర్శి వరకు వచ్చే నెల నుంచి రైళ్లు నడపాలని ఆ శాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే గూడ్స్ రైళ్లు దర్శికి మెటీరియల్ తీసుకొని వచ్చాయి. రైల్వే లైను పటిష్టతను తనిఖీ చేసేందుకు ప్రయోగాత్మకంగా అధికారులు గూడ్స్ రైలులో మెటీరియల్ ఇక్కడకు తెచ్చారు. దర్శి వరకు రైల్వే లైను నిర్మాణం పూర్తయింది. అక్కడక్కడా పెండింగ్‌లో ఉన్న పనులు ముమ్మరంగా చేస్తున్నారు. అదేవిధంగా ఇక్కడ ప్రయాణికులు టికెట్లు తీసుకునేందుకు, ఇతర మౌలిక వసతులు ఏర్పాట్లల్లో భాగంగా పనులు ముమ్మరం చేశారు. టికెట్ కౌంటర్ రూమ్ నిర్మించారు. అక్కడ లైనింగ్ చేస్తున్నారు. ప్లాట్‌ఫారం మీద సిమెంట్ కంకరతో ఫ్లోరింగ్ వేస్తున్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు షెడ్లు నిర్మించారు. పనులన్నీ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించటంతో అందుకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలో రైళ్లు నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా దర్శి ప్రాంత ప్రజల కల నెరవేరనుంది.

వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల

చినగంజాం, మార్చి 25: కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువజాము నుంచే అభిషేకాలు, ఆకుపూజలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారి మాజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామిని పలు రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరి గింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం దేదీప్య మానంగా వెలుగొందింది. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభ, వీరాంజనేయస్వామి విద్యుత్ కటౌట్‌ను ఏర్పా టుచేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి.


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ, వీరాంజనేయస్వామి కటౌట్

'చీరాల'లో మహిళలే కీలకం

చీరాల, మార్చి 25: చీరాల నియోజకవర్గంలో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 2,00,332(ప్రస్తుతం) మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 97,559 మంది. మహిళలు 1,02,750 మంది, ఇతరులు 23 మంది ఉన్నారు. పురుషుల కన్నా మహిళల ఓట్లు 5వేల చిలుకు ఉన్నాయి. దీంతో మహిళా ఓటర్లు కీలకం కానున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏప్రిల్ 15వ తేది వరకు ఓట్లు చేర్పులకు అవకాశం ఉంది. అప్పటికీ ఓటరు జాబితాలో మరికొన్ని చేర్పులు ఉండొచ్చు. ఆతరువాత చివరి ఓటరు జాబితాను ప్రచురిస్తారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రకటించటంతో ఇప్పటినుంచే ఆయా పార్టీల శ్రేణులు అందుబాటులో ఉన్న ఓటరు జాబితాలలో ఎవరికి ఎక్కడెక్కడ అనుకూలంగా ఉంటుంది, ఎక్కడెక్కడ ప్రతికూలంగా ఉంటుందనే కోణంలో పోస్టుమార్టం చేసుకుంటున్నారు. నామినేషన్ల ప్రక్రియ కన్నా ముందుగానే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నియోజక వర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గంతో విలక్షణంగా సాగుతున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అడుగులు ఎటు అనే విషయంపై కూడా జనాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంమీద జరుగుతున్న పరిణామాలను ఓటర్లు నిశితంగా గమనిస్తున్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

యద్దనపూడి(మార్టూరు), మార్చి 25: యద్దనపూడి గ్రామంలో సోమవారం సాయిబాబా దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. దేవాలయంలో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా దేవాలయం వద్ద హోమాలు, యాగం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన మాజీ డీజీపీ గిరీష్ కుమార్ విచ్చేశారు. మధ్యాహ్నం దేవాలయ కమిటీ వారు భారీగా భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.


సాయిబాబా విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కొండయ్యకు పలువురు మద్దతు

చీరాల, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు రోజురోజుకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్యను మున్సిపల్ 28వ వార్డు మాజీ కౌన్సిలర్ పండ్లూరి ప్రమీలమ్మ, ఆనందరావు కలిసి తమ మద్దతు తెలిపారు. వేటపాలెం మండలం రామాపురంకు చెందిన పలువురు మత్స్యకారులు వాయిల పెరుమాళ్ ఆధ్వర్యంలో కొండయ్యను కలసి మద్దతు తెలిపారు. వారి మెడలో కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాల మహా నాడు రాష్ట్ర కన్వీనర్ పీకా మాణిక్యరావు తదితరులు కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు.

చీరాల మండలం ఈపురుపాలెం పద్మనాభునిపేట శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ జడ్పీటీసీ గుద్దంటి చంద్రమౌళితో కలిసి కొండయ్య పాల్గొన్నారు. స్థానిక చేనేత పెద్దలు, నాయకులు, భక్తులతో మాట్లాడారు. వేటపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షుడు చప్పిడి వెంకట్రావు ఆధ్వర్యంలో పుల్లరిపాలెం మాజీ సర్పంచ్ ఆసోది అంకిరెడ్డి కొండయ్యను కలిసి మద్దతు తెలిపి పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొండయ్యకు మద్దతు తెలుపుతున్న మాజీ కౌన్సిలర్ పండ్లూరి ప్రమీలమ్మ, ఆనందరావు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం!

చీరాల, మార్చి 25: కడప జిల్లా ఒంటిమిట్టలో వైసీపీ నేతల భూ ఆక్రమణతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కుటుంబసభ్యులను సోమవారం చీరాల నియోజకవర్గానికి చెందిన చేనేత జనసమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మాచర్ల మోహనరావు, టీడీపీ నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధైరపడొద్దు.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతిచెందిన ఒక్కొక్కరికి రూ.50లక్షలు చొప్పున కుటుంబసభ్యులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుత్తి శివయ్య, దేవనకోటి నాగేశ్వరరావు, వావిలాల దాశరథి పాల్గొన్నారు.


ఆత్మహత్యకు పాల్పడిన వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చీరాల నియోజకవర్గ చేనేత ప్రతినిధులు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం, మార్చి 25: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. చినగంజాం ప్రాంతంలోని రొంపేరు కాలువపైగల రైల్వేబ్రిడ్జి సమీపంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి సుమారు వారం రోజుల క్రితం ఆత్యహత్య చేసుకొని మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుని జేబులో ఉన్న ఫోను నెంబర్ల ఆధారంగా అతని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. చినగంజాం రైల్వేస్టేషన్ స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెదగంజాం రెవెన్యూ అధికారి కొమ్ము మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఒంగోలు ఎంపీగా మాగుంట పోటీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : ఒంగోలు లోక్‌సభ ఎన్నికల్లో తన తండ్రి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ చేస్తారని యువ పారిశ్రామికవేత్త, మాగుంట తనయుడు రాఘవరెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. తన తండ్రి మాగుంట ఒక సీనియర్ ఎంపీగా ఉండటం వల్ల రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతోపాటు కేంద్ర పథకాలు రాష్ట్రంలో సమర్థవంతంగా నిర్వహిస్తారనే అభిప్రాయంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ పర్యాయం ఒంగోలు పార్లమెంట్‌కు శ్రీనివాసులరెడ్డి పోటీ చేయిస్తే మంచి ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయం తెలియజేసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందువల్ల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులు, ప్రజలు, మాగుంట అభిమానులు మా తండ్రి శ్రీనివాసులరెడ్డి విజయానికి కృషిచేయాలని కోరారు.

ట్రాన్స్‌జండర్ ఆత్మహత్య

ఒంగోలుక్రైం,మార్చి25: ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్యకు పాల్పడింది. అద్దంకి చెందిన తమ్మిశెట్టి స్వాతి(27) ప్రస్తుతం స్థానిక సత్యనారాయణపురంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ ఆదివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాలలోకి వెళితే స్వాతి ఒంగోలులో నివాసం ఉండి జీవనం సాగిస్తున్నది. ఆమెకు ఓ ప్రియుడు ఉన్నాడు. వారిమధ్య మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మార్టూరులో వైసీపీ కోటకు బీటలు

- ముస్లిం మైనారిటీ నేతలతో పాటు
- వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక

మార్టూరు, మార్చి 25: మార్టూరులో అధికార పార్టీ కోటకు బీటలు పడుతున్నాయి. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరుతున్నారు. సీనియర్ నాయకుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం ఉదయం మండలంలోని ఇసుక దర్శిలో గల క్యాంపు కార్యాలయంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లుతో పాటు మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు గన్నవరం బుడే, మార్టూరు పంచాయతి మూడవ వార్డు మెంబరు నందూరి ఖాసిం, నాల్గవ వార్డు మెంబరు చందోలు ఖాజావలి, 13వ వార్డు మెంబరు పెన్నుబోయిన భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకుడు అట్లూరి బాబూరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు అనుచరులతో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతించారు. 4నెలల క్రితం వైసీపీకి చెందిన 11 వార్డు మెంబరు కన్నెగంటి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు.

ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రం కోలుకోవాలన్నా, రాష్ట్ర ప్రజానీకం భవిష్యత్తు బాగుపడాలన్నా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావలసిన అవసరం ఏర్పడిందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబుపై నమ్మకంతో పార్టీలో చేరిన వైసీపీ నాయకులను ఆయన అభినందించారు. ఒక ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి వీడ్కోలు పలకడానికి సైనికుల్లాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, జాష్టి సాంబశివరావు, కమ్మ శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు వైసీపీ నేతలు


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లు

జొన్నతాళి ఉపసర్పంచ్ చేరిక

జొన్నతాళి ఉపసర్పంచ్, వైసీపీ నేత ఆవుల కోటిరెడ్డి అనుచరులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పలువురు బీసీ నాయకులు పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో శివరాత్రి శ్రీను, శానంపూడి చైతన్య, బంగారు బాబు, తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నేతల హడావుడి

- శింగరకొండలో సామాన్య భక్తులకు చుక్కలు
- పార్టీ రంగులతో ఉన్న ట్యాంకర్‌తో అన్నదాన సత్రాలకు నీటి సరఫరా

అద్దంకి, మార్చి 25: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల సోమవారంతో ముగిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ ప్రభల ఏర్పాటు బాగా తగ్గటంతో భక్తుల రద్దీ కూడా తక్కువగా ఉంది. ఇక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నేతలు మాత్రం హడావుడి చేశారు. వైసీపీ రంగులతో ఉన్న ట్యాంకర్‌తో అన్నదాన సత్రంల వద్ద నీటి సరఫరా చేయటం విమర్శలకు తావిస్తుంది. అదేసమయంలో వైసీపీ అద్దంకి, చీరాల అభ్యర్థులు పాణెం హనిమిరెడ్డి, కరణం వెంకటేష్‌లు మంది మార్బలంతో దేవాలయంలో పూజలకు హాజరు కావటంతో సాధారణ భక్తులకు మరింత ఇబ్బంది కలిగింది. నాయకుల సేవలతో తరించిన దేవాలయ సిబ్బంది, పోలీస్‌లు సాధారణ భక్తుల వాహనాలను ఎండ సమయంలో సైతం నామ్ రోడ్డు వద్దనే నిలిపివేశారు. దీంతో దేవాలయం వద్దకు వెళ్ళే భక్తులు ఎండవేడిమికి ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల రద్దీ ఒకింత ఉండగా, అనంతరం క్యూలైన్‌లతో పాటు దేవాలయ పరిసరాలు సైతం ఖాళీగా దర్శనమిచ్చాయి. తిరునాళ్లలో ఒకేఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటుచేయటంతో రాత్రి సమయంలో కూడా భక్తుల రద్దీ తక్కువగా ఉంది.


ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న వైసీపీ అద్దంకి, చీరాల అభ్యర్థులు హనిమిరెడ్డి, వెంకటేష్

సమన్వయంతో పనిచేద్దాం.. వైసీపీని గద్దె దింపుదాం

- జనసేన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 25: సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో అహంకార, నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక కొల్లావారి కల్యాణ మండపంలో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్‌కోసం టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు చారిత్రకమైన నిర్ణయమని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం, అరాచకం తప్ప అభివృద్ధి మచ్చుకైన కానరాలేదన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయకుమార్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పిలుపుమేరకు ఏలూరి సాంబశివరావు విజయంలో జనసైనికులు కలసి కట్టుగా పనిచేసి అత్యధిక మెజార్టీని తీసుకురాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి, విజయ కుమార్‌ను జనసైనికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, కఠారి సురేంద్రబాబు, దీర్ఘాల రమేష్, ఒగ్గిశెట్టి నరసింహం, తులసి చంటి, రంగిశెట్టి ఆంజనేయులు, శీలం కుమార్, కందా సురేంద్ర, లగడపాటి నాగరాజు, లగడపాటి శంకర్, నారిశెట్టి మల్లి, దాసరి సాంబయ్య, పెంజంద్ర రమణ, రంగిశెట్టి సింగయ్య, పసుపులేటి రవి, సుధాకర్, తులసి నాగు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సాంబశివరావు, విజయకుమార్‌ను సన్మానిస్తున్న జనసైనికులు

వైభవంగా స్వామివార్ల కల్యాణం

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 25: పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతి సమేత అమరరేశ్వర స్వామి, భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేశారు. కల్యాణ వేడుకల అనంతరం సోమవారం స్వామివార్లను నందివాహనంతో ప్రత్యేక వాహనంలో భక్తుల దర్శనార్థం రథోత్సవం నిర్వహించారు. స్వామి వారి వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి తిరుములశెట్టి శిరీష ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అర్చక స్వాములు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఉంగుటూరు స్వామివార్ల కల్యాణం

టీడీపీలోకి వలసల పర్వం

పర్చూరు, మార్చి 25: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీలోకి వలసల పర్వం జోరందుకుంది. రోజురోజుకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున చేరుతున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశిరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. పర్చూరు, చినగంజాం, మార్టూరు, కారంచేడు మండలాల పరిధిలో వివిధ సామాజిక వర్గాల నుంచి భారీగా చేరికల పర్వం కొనసాగుతుంది. సోమవారం కారంచేడు మండలం ఆదిపూడికి చెందిన వైసీపీ నాయకులు పారి గ్రేసయ్య, ధరరాజుపల్లి నాగరాజు, పారి వినోద్ కుమార్, వలేరు కల్యాణ్ బాబు, వంశీకృష్ణ, కోటేశ్వరరావు, జంతాల సుబ్బారావు, పారి రమేష్‌తోపాటు దాదాపు 50 కుంటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు.

అలాగే, పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వైసీపీ నాయకులు దున్నా సుబ్బారావు, తమ్ములూరి చిట్టిబాబు, దున్నా మరియదాసు, నేహేమియా, మురికిపూడి అశోక్, దున్నా శ్యామ్యూల్, ప్రేమ్‌కుమార్, మహేష్, కట్టెంపూడి గోపీచెంద్, ఉన్నా చిన్నా అక్కయ్యలు పార్టీలో చేరారు. పర్చూరులోని 16వ వార్డులోని వైసీపీకి చెందిన పలు కుంటుంబాలు కొల్లా శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు.

కార్యక్రమంలో టీడీపీ పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, తంగెళ్ళ మల్లికార్జునరావు, దూళ్లిపల్లి వెంకటస్వామి, మామిడిపాక హరిప్రసాద్, కొండ్రగంటి సుబ్బారావు, ఆకుల మధుబాబు, మల్లాది సురేష్, చెరుకూరి చింపయ్య, కాపు బుల్లోడు, మక్కెన శేఖర్‌బాబు, కంచేటి శ్రీహరి, షేక్ బషీర్, పఠాన్ సమీర్, తదితరులు పాల్గొన్నారు.


పర్చూరులో టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే సాంబశివరావు

కూనం కుటుంబమంతా వైసీపీ సభ్యులే!

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 25 : విశాఖలో పట్టుబడిన కొకైన్ వ్యవహారంలో కీలకమైన కూనం పూర్ణ చంద్రరావు వైసీపీ సీనియర్ నాయకుడిగా ఉండగా, ఆయన కుటుంబమంతా వైసీపీ వ్యవస్థాపక సభ్యులే అని సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి బీఎన్. విజయ్ కుమార్ అన్నారు. సోమారం సంతనూతలపాడు నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ మొదటి స్థానంలో ఉంటే జగన్ రెడ్డి హయాంలో డ్రగ్స్ రవాణాలో నెం.1 స్థానానికి చేర్చాడని విమర్శించారు. వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం వైసీపీ సీనియర్ నేత అని, ఇతనికి విజయసాయి రెడ్డితో సంబంధాలు ఉన్నాయని అన్నారు.

విశాఖలో పట్టుబడిన కంటైనర్‌లో వివిధ రకాల మత్తు పదార్థాలు ఉన్నాయని సీబీఐ తన నివేదికలో పేర్కొందన్నారు. గతంలో విజయవాడలోని ఆశీ ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ. 21 వేల కోట్లు విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇపుడు ఏకంగా డ్రై ఈస్ట్‌తో కలిపి రూ. 50 వేల కోట్ల విలువైన 25వేల కిలోల మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంపట్ మిన్ వంటి మత్తు పదార్థాలు దొరికాయన్నారు. బ్రెజిల్ నుంచి మత్తు పదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసే జగన్ రెడ్డి తన అధికారులను పంపారా ? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం, మాఫియాతో ఇన్నాళ్ళు ప్రజల ఇళ్లూ, ఒళ్ళు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలో ఉన్నాయని ఆయన విమర్శించారు. వైసీపీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై నిందలు వేయడం దుర్మార్గమన్నారు. మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని, గొల్లపూడి సుబ్బారావు, సెక్రటరీ కాకర్ల లక్ష్మి ప్రసాద్, రావుల సుబ్బారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కంకణాల గోపి, అట్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

చినగంజాం, మార్చి 25: మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న హరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కబడ్డీ క్రీడాకారులకు సన్మానం

చినగంజాం, మార్చి 25: స్థానిక బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల బీహార్‌లో జరిగిన 33వ అంతర్జాతీయ సబ్‌జూనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టు 3వ స్థానంలో నిలిచింది. జట్టులో ఉన్న చినగంజాం ప్రాంతానికి చెందిన ఆట్ల అభిషేక్‌రెడ్డి, భోగిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఆట్ల అశోక్‌రెడ్డిలకు, ఆడుదాం ఆంధ్ర యంగ్ టాలెంటెడ్ క్రీడాకారుడుగా ఎంపికై రూ.10 లక్షల అవార్డు అందుకున్న బాలకృష్ణారెడ్డికి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎం.గిరిబాబు, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భోగిరెడ్డి నాగాంజనేయరెడ్డి, కోశాధికారి దేశం సుబ్బారెడ్డి, బి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి రాత అవర్చుకోవాలి

ఇంకొల్లు, మార్చి 25: విద్యార్థులు చదువుతో పాటు మంచి రాత అలవర్చుకోవాలని పీవీఆర్ అకాడమీ ఆఫ్ హ్యాండ్ రైటింగు ఒంగోలు శిక్షకులు మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని గంగవరంలో బాలల విద్య వైజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా తెలుగులో మంచి రాతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ ఆత్మకూరి సుబ్బారావు, కరి కమలేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, తెలుగుపండిట్ రాధ, రైతుసంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, రాంబాబు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గొర్రెపాడులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బల్లికురవ, మార్చి 25: మండలంలోని గొర్రెపాడులో ఏర్పాటుచేస్తున్న అభయాంజనేయ స్వామి విగ్రహ పతిష్ఠ బుధవారం ఉదయం 8.14 గంటలకు జరగనుంది. యాగశాలను ఏర్పాటుచేసి పూజలు ప్రారంభించారు. అభయాంజనేయ స్వామి పక్కనే బాల వీరాంజనేయస్వామి, వినాయక స్వామి విగ్రమాలను కూడా ప్రతిష్ఠించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామంలో సోమవారం ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది.


అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబు చేసిన ప్రాంగణం

ఉత్సాహంగా హోలీ వేడుకలు

బల్లికురవ. మార్చి 25: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం హోలి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు క్వారీలలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు రంగులు చల్లుకుంటూ పండుగ సంబరాలలో మునిగి తేలారు. కొందరు కార్మికులు తమ సొంత గ్రామాలకు తరలివెళ్లారు. గ్రామాలలో చిన్నారులు సైతం రంగులలో మునిగి తేలారు. ఈసందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే, సోమవారం లక్ష్మీ జయంతి, పౌర్ణమి కావడంతో ప్రజలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఎంపీ సురేష్ కాన్వాయ్‌తో భక్తులకు ఇక్కట్లు

అద్దంకి, మార్చి 25: బాపట్ల ఎంపీ సురేష్ కాన్వాయ్‌తో సోమవారం రాత్రి శింగరకొండ తిరునాళ్లకు రావడంతో రాత్రి 9.30 గంటల సమయంలో భక్తులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 9 గంటల వరకు భక్తుల సందడి పెద్దగా లేకపోగా, 9 గంటల సమయం నుంచి భక్తులు రాక ప్రారంభమైంది. అదేసమయంలో ఎంపీ కాన్వాయ్ తిరునాళ్లలోకి రావవంతో భక్తులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. దీంతో మహిళలు, వృద్ధులు మరింత ఇబ్బంది పడ్డారు.

అన్నపూర్ణాదేవి మందిరం ప్రారంభం

అద్దంకి, మార్చి 25: శింగరకొండ వాసవికన్యకాపరమేశ్వరి అన్నదాన సత్రంలో కాశీ అన్నపూర్ణాదేవి మందిరాన్ని సోమవారం ప్రారంభించారు. దాతలు గార్లపాటి శ్రీనివాసరావు, రాధారాణి సహకారంతో అన్నపూర్ణాదేవి మందిరం నిర్మాణం చేశారు. సత్రం అధ్యక్షుడు శ్రీరాం నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, భాస్కర్ సప్లయర్స్ అధినేత, టీడీపీ నాయకుడు గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

ఒంగోలు (కల్చరల్), మార్చి 25: పౌర్ణమి సందర్భంగా సోమవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత ఘనంగా జరిగింది. స్థానిక జయరాం హాలు దగ్గర ఉన్న గోశాల వద్ద ముందుగా పూజలు నిర్వహించి అనంతరం కోర్టు సెంటర్, కేశవస్వామి పేట, శర్మా కళాశాల, గద్దలగుంట, కొణిజేడు బస్టాండు, రాజాపానగల్ రోడ్డు మీదుగా శ్రీగిరికి భక్తులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారు అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తులు గోవింద నామ స్మరణ చేశారు. అదేవిధంగా మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో గిరిప్రదక్షిణ కమిటీ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవ రెడ్డి, చిలకపాటి రంగారావు, రాధారమణ గుప్తా జంధ్యం పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్థానిక కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీలక్ష్మి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దంపతులు పెద్దసంఖ్యలో పాల్గొని వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు రమానాధాచార్యులు, కె.వి.ఎల్.శర్మావధాని, నాగార్జున దేవ్‌లు ముందుగా విష్వక్సేన పూజ, కలశారాధన, రమా వసుంధర సహిత సత్యనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకం మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత జవాబు పత్రాల మూల్యాంకనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25: ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల రెండో విడత మూల్యాంకనం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత మూల్యాంకనం ముందుగా ఈనెల 28వతేదీ నుంచి నిర్వహించాల్సి ఉండగా రెండు రోజుల ముందుగానే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బాటని, జువాలజీ, కామర్స్ పేపర్ల వాల్యువేషన్ జరుగుతుందని తెలిపారు. మూల్యాంకానికి నియమితులైన లెక్చరర్లు మంగళవారం ఉదయం స్థానిక ఏకేవీకే జూనియర్ కాలేజీలో హాజరుకావాలన్నారు. జిల్లాలోని ప్రిన్సిపాళ్లందరూ వారి కాలేజీలోని బా టని, జువాలజీ, కామర్స్ అధ్యాపనులను స్పాట్ వాల్యువేషన్ కేంద్రానికి పంపించాలని కోరారు

పకడ్బందీగా ఓపెన్ స్కూలు పరీక్షలు

ఒంగోలు(విద్య), మార్చి 24 : జిల్లాలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో పరీక్షల నిర్వహణ కోసం 18 స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేస్తున్నాయన్నారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే యాక్ట్ 25 ప్రకారం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓపెన్ స్కూలు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్‌కే అక్బర్ ఆలీ, ఎం. శ్రీనివాసరావులు కంభం, బేస్తవారిపేట, రావిపాడు, పొదిలిలోని ఓపెన్ స్కూలు సెంటర్లను తనిఖీ చేసి ఎలాంటి అవకతవకలు జరగలేదని నిర్ధారించారని డీఈవో సుభద్ర తెలిపారు.

శాస్త్రోక్తంగా గోమాత అంత్యక్రియలు

ఒంగోలు (కల్చరల్), మార్చి 25:స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని గోశాలలో గత కొన్ని సంవత్సరాలు ఉన్న గిరి జాతి గోవు మృతి చెందింది. దీంతో గోవు ఖనన కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత ఆలూరు వెంకట రమణారావు గో సంరక్షణ ధ్యేయంగా దేవస్థానంలో గోశాలను ఏర్పాటుచేసి ప్రత్యేకంగా గిరిజాతి ఆవులను తెప్పించారు. అందులో ఒకటి సోమవారం మృతిచెందింది. ఆవు కళేబరానికి పసుపు, కుంకుమలు రాసి పూజ చేసి శాస్త్రోక్తంగా ఖననం చేశారు. నిర్వహించారు.

సోమశిలలో 10.690 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 25: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి ప్రాజెక్టులో 10.690 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 350, డెల్టాకు 1,500, దక్షిణ కాలువకు 330 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ (మంగళవారం) : 6.22 | సహారి (బుధవారం) : 4.50

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 36.6 25.8 | కావలి : 34.0 23.0 | కందుకూరు : 34.0 26.0 | ఆత్మకూరు : 37.0 24.0 | ఉదయగిరి : 37.0 26.0


ఓటీఎస్.. తుస్!


సంపూర్ణ గృహ హక్కు పథకం అపహాస్యం

- రెండేళ్ల క్రితం కేటగిరీల వారీగా నగదు వసూలు
- ఇప్పటికీ లబ్ధిదారులకు అందని హక్కు పత్రాలు



ఓటీఎస్ పథకం పేరుతో లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేసిన కాలనీ ఇళ్లు





'దశాబ్దాలుగా ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరైన ఇళ్లను క్రమబద్ధీకరిస్తాం. ఇందుకు నిర్ణీత ఫీజు చెల్లిస్తే చాలు. మీ పేరుమీదనే ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తాం. ఆ పత్రాలను బ్యాంకులో తనఖా పెట్టుకోవచ్చు కూడా.' అంటూ ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) పథకాన్ని తెరపైకి తెచ్చిన వైసీపీ ప్రభుత్వం జిల్లాలో అన్ని వర్గాల ప్రజల నుంచి రూ.కోట్లు వసూలు చేసింది. అయితే, లబ్ధిదారులు నగదు చెల్లించి రెండేళ్లు దాటినా చాలా మందికి గృహహక్కు పత్రాలు అందలేదు. మొన్నటిదాకా ఎన్నో ఆశలతో ఎదురుచూసిన లబ్ధిదారులు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆశలు వదులుకున్నారు.

సంగం, మార్చి 25 : జిల్లాలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) అపహాస్యమైంది. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు హయం నుంచి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం (1983 నుంచి 2011) వరకూ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించుకున్న లబ్ధిదారులకు వైసీపీ సర్కారు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు కొలతలు తీసి సంపూర్ణ గృహ హక్కు కల్పిస్తామని జగన్ సర్కారు నమ్మబలికింది. జిల్లాలో వేల మంది లబ్ధిదారుల నుంచి కోట్లాది రూపాయలు కట్టించుకుంది. ఇది జరిగి రెండున్నరేళ్లు గడుస్తున్నా హక్కు పత్రాలు ఇంతవరకూ చాలా మందికి అందలేదు.

● నాలుగు కేటగిరీలుగా..

1983 నుంచి 2011 వరకు గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంలో నాలుగు కేటగిరీలుగా విభజించారు. కేటగిరీ ఏ కింద లబ్ధిదారుడు గృహనిర్మాణ సంస్థ నుంచి అప్పు తీసుకొని ఉండి మృతి చెందితే వారి వారసులకు పట్టా అందిస్తారు. గ్రామీణ ఆప్రంతాల్లో ఇల్లు ఉంటే రూ.10 వేలు, మున్సిపాలిటీలో రూ.15 వేలు, కార్పొరేషన్‌లో రూ.20 వేలు చొప్పున వసూలు చేశారు. కేటగిరీ బికి సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తి నుంచి ఇతరులు ఆ ఇంటిని కొనుగోలు చేసినా క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశమిచ్చారు. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాల్లో రూ. 20 వేలు, మున్సిపాలిటీల్లో రూ.30వేలు, కార్పొరేషన్ పరిధిలో రూ.40 వేలు వసూలు చేపట్టారు. కేటగిరీ సీకి సంబంధించి ప్రభుత్వ రుణం పొందకుండా సొంతంగా ఇంటిని నిర్మించుకున్నవారి నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారు. కేటగిరి డీ కింద ప్రభుత్వం పట్టా ఇచ్చిన తరువాత దానిని అమ్ముకుంటే కొనుగోలు చేసిన వారు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10వేలు, మున్సిపాలిటీల్లో నూ 15వేలు, కార్పొరేషన్‌లో రూ. 20వేల వంతున వసూలు చేశారు.

● లబ్ధిదారుల లెక్క ఇలా..

జిల్లావ్యాప్తంగా అధికారులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా వసూలు చేయడంతో ఇటు లబ్ధిదారుల నుంచే కాకుండా ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వెలువడ్డాయి. 1983 - 2011 మధ్య కాలంలో సుమారు రెండున్నర లక్షల ఇళ్లు నిర్మించినట్లు అప్పట్లో నిర్ధారించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ. అయితే ఈ లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు చాలా ఇబ్బందులు పడ్డారు. సరైన అడ్రస్సులు లేకపోవడం, ఇళ్లు ఉన్నా లబ్ధిదారులు లేకపోవడం, కొన్ని ఇళ్లు శిథిలమైపోవడంతో రెండు లక్షలకుపైగా లబ్ధిదారులను గుర్తించారు. వీరి నుంచి సుమారు 90 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. సుమారు రూ.10 కోట్లు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కానీ లబ్ధిదారుల నుంచి సహకారం లభించకపోవడం, మరోవైపు జిల్లాల విభజన పుణ్యమా అని ఈ అంశం మరుగున పడిపోయింది. దీంతో డబ్బులు కట్టిన వారికి ఎదురుచూపులు తప్పలేదు.

● బలవంతంగా వసూలు

ఓటీఎస్ విషయంలో ఒక్క లబ్ధిదారులే కాదు. అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యులే. అందరికీ టార్గెట్‌లు విధించడంతో వారు పేదల పింఛన్లు తొలగిస్తామని, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అప్పట్లో బెదిరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ముడిపెట్టారు. డ్వాక్రా గ్రూపులో ఉన్నవారితో రుణాలు ఇప్పించి మరీ ఓటీఎస్ సెటిల్‌మెంట్ కట్టించుకున్నారు. వారికి ఇప్పటికీ డాక్యుమెంటు ఇవ్వలేదు. మరికొందరికి ఇచ్చినా అందులో వివరాలు తప్పుగా నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తీసుకున్నవారు రుణాలకు బ్యాంకుల వద్దకు వెళితే తిరస్కరిస్తున్నారు. దీంతో అధికారులిచ్చిన రిజిస్ట్రేషన్ పత్రాలు చిత్తుకాగితాలు మాదిరిగా బీరువాల్లో భద్రంగా పెట్టుకునేందుకు మాత్రమే పనికొస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శనగ రైతుకు ఎన్నికల పోటు!

కందుకూరు, మార్చి 25: శనగ రైతుకు సార్వత్రిక ఎన్నికల పోటు తగిలింది. శనగ నూర్పిళ్ల సమయంలోనే ఆర్థిక సంవత్సరం ముగింపు రావడం, దానికితోడు దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శనగలు కొనేందుకు వ్యాపారులు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు మధ్య దళారులు ధరలను తీవ్రంగా దిగజార్చటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.



కందుకూరు ప్రాంతంలో శనగ కంపను మిల్లరుకు వేస్తున్న కూలీలు

● నెల రోజుల్లో రూ.4వేలు తగ్గుదల

నెల క్రితం వరకు క్వింటా రూ.12వేలు వరకు ధర పలికిన కాగ్-2 రకం (తెల్లశనగలు)ను ప్రస్తుతం రూ.8 వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా శనగ నూర్పిళ్ల సమయంలో ఏటా ధర పెరగడం పరిపాటి. ఈ ప్రాంతంలో శనగ నూర్పిళ్లు జరిగే సమయంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ మార్కెట్ల నుంచి శనగ ఎగుమతిదారులు, వారి ప్రతినిధులు ఈ ప్రాంతంలో తిష్టవేసి శనగలు కొనుగోలు చేసేవారు. దీంతో సాధారణ సమయం కన్నా నూర్పిళ్ల సమయంలో క్వింటాకు కనీసం నాలుగైదు వందలు ధర పెరగటం పరిపాటిగా ఉండేది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా నూర్పిళ్ల సమయానికి క్వింటాకు రూ.4వేల వరకు ధర పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. శనగ కొనుగోళ్లు, అమ్మకాలకు కోట్లాది రూపాయల నగదు లావాదేవీలు అవసరం. శనగల కొనుగోళ్లు, తరలింపు ఎక్కువ శాతం అనధికారికంగా జరిగేది కావడంతో బ్యాంకు లావాదేవీలు కాకుండా నేరుగా నగదు చెల్లించి వ్యాపారులు తీసుకెళ్లేవారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా దూరప్రాంతాల నుంచి కోట్లాది రూపాయల నగదు తేవడం అసాధ్యం కావడంతో వ్యాపారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపటం లేదని సమాచారం. దీనికితోడు ఆర్థిక సంవత్సరం ముగింపు కావటంతో బ్యాంకులలో లావాదేవీలు కూడా క్లిష్టంగా మారి ఆ ప్రభావం శనగ కొనుగోళ్లపై తీవ్రంగా పడింది. దీంతో ఇదే అదనుగా స్థానిక వ్యాపారులు, మధ్య దళారీలు ధరను దారుణంగా దిగజార్చేశారు. దీంతో అడిగిన ధరకు తెగనమ్ముకోలేక శీతల గిడ్డంగులలో పెట్టనిదే నిల్వ ఉండే సరుకు కావటంతో రైతులు సతమతమవుతున్నారు. శీతల గిడ్డంగులలో బాడుగ, రవాణా ఖర్చులు భరించుకుని నిల్వచేయటం సన్న, చిన్నకారు రైతులకు తలకుమించిన భారం కావటంతో ఆందోళన చెందుతున్నారు.

దారుణంగా పతనమైన ధర

● తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది శనగ సాగుకు అదను దాటిపోయాక చేయటంతో దిగుబడులు కూడా భారీగా తగ్గిపోయాయి. ఎకరానికి తొమ్మిది, పది క్వింటాళ్ల సరాసరి దిగుబడి రావాల్సిన శనగలు ప్రస్తుతం నూర్పిళ్లలో ఐదారు క్వింటాళ్లకు మించి రావటం లేదు. దీనికితోడు క్వింటాల్‌కు 4వేలు ధర తగ్గటంతో రైతులు ఆశించిన రాబడిలో 50వేలకు పైగా కోతపడింది. ధర తగ్గటం వల్ల పాతికవేలు, సరాసరిన ఎకరానికి మూడు క్వింటాళ్ల దిగుబడి తగ్గటంతో మరో పాతికవేలు రైతు నష్టపోతున్న పరిస్థితి. ఆశించిన రాబడిలో ఎకరానికి యాభైవేలు కోతపడటంతో తీవ్రంగా నష్టపోక తప్పదని శనగరైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పెద్దరైతులు ఎన్నికలు పూర్తయితే ఆశించిన ధర వస్తుందని శీతల గిడ్డంగులలో నిల్వ చేస్తుండగా ఆ స్థోమత లేని సన్న, చిన్నకారురైతులు నష్టపోయేందుకు సిద్ధపడి దళారీలకు తెగనమ్ముకుంటున్నారు.



కేరింతల హోలీ



నెల్లూరు (సాంస్కృతికం): రంగుల పండుగ హోలీ సంబరాలను జిల్లావాసులు ఘనంగా జరుపుకున్నారు. నెల్లూరులో ఆదివారం అర్ధరాత్రి మార్వాడీలు, రాజస్తానీలు సంప్రదాయబద్ధం గా హోలీ దహన్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం ఆబాలగోపాలం రంగులు చల్లుకుని హంగామా చేశారు. అనంతరం జైన్ మందిరాల్లో పూజలు చేసి స్వీట్లు పంచుకున్నారు. కాగా, వీఆర్ హైస్కూల్ మైదానంలో విద్యార్థులు, యువతీ యువకులు, పెద్దలు, చిన్నలు వేలాదిమంది హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. బాలభవన్ ఆధ్వర్యంలో మినీబైపాస్ రోడ్డు, వనంతోపు సెంటర్ నర్సరీలో హోలీ సంబరాలు చేసుకున్నారు.

మోహినీ అలంకరణలో రంగనాథుడు

గరుడారూఢా గోవింద !

● బంగారు గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం): రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం గరుడోత్సవం భక్తులకు కనువిందు చేసింది. రంగనాథస్వామికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకారం, విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారు మోహినీ అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగింది. కాగా, పాల్గుణ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మీ జయంతిని ఘనంగా జరిపారు. మూలాపేట శంకరమఠం, పప్పులవీధి పాండురంగస్వామి ఆలయంలో చండీ హోమాలు జరిగాయి.

శ్రీవారికి వైభవంగా పుష్పయాగం

● వేదమంత్రాలతో మారుమోగిన బిలకూటక్షేత్రం

బిట్రగుంట, మార్చి 25: బోగోలు మండలం కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, సహస్ర నామార్చన, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. స్వామి,అమ్మవార్లకు నరసింహాచార్యులు, కళ్యాణాచార్యులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పరిమళభరిత పుష్పాలతో వేదమంత్రాల మధ్య పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిలకూటక్షేత్రం శ్రీవారి నామస్మరణతో మారుమోగింది. రాత్రికి శ్రీనివాసుడికి ఏకాంతసేవను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్మవారిపాలెంకు చెందిన కరియావుల అప్పలనాయుడు-శ్రీలత, రమేష్-లక్ష్మీలావణ్య, కావలికి చెందిన గాదంశెట్టి వేణుగోపాల్ - అనంతలక్ష్మి, అమరా వేదిగిరి సుబ్బరాయుడు గుప్తా- విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సరిపెడతారా.. సంగతేంటో తేలుస్తారా!?

ఎక్కడికక్కడ క్వార్ట్జ్ అక్రమార్కులు గప్‌చుప్!

- ప్రభుత్వ భూములు కుళ్లబొడిచి రూ.కోట్లు స్వాహా
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుతో కదలిక
- పొదలకూరు, సైదాపురంలో అక్రమాల గుర్తింపు
- కేసులు పెట్టినా కనిపించని పురోగతి
- తమకేమీ పట్టదన్నట్లుగా రెవెన్యూ యంత్రాంగం

క్వార్ట్జ్ అక్రమాలపై రెండురోజులు హడావిడి చేసిన అధికారులు, పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారా!? లేదా అంతటితో సరిపెడతారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది. మూడు నెలలుగా ఈ అక్రమ తవ్వకాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు స్పందించలేదు. అయితే, ఎన్నికల కోడ్ తర్వాత టీడీపీ నేతలు కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు స్పందించారు. పొదలకూరు, సైదాపురం మండలాల్లో దాడులు నిర్వహించి తవ్వకాల్లో అక్రమాలను గుర్తించారు. భారీగా క్వార్ట్జ్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కేసులు కూడా పెట్టారు. అయితే, ఇప్పటివరకు తరలిపోయిన రూ.వందల కోట్ల ప్రజాధనానికి బాధ్యులెవరు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నెల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గత వారం పొదలకూరు మండలంలోని మొగళ్లూరు, మరుపూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన ప్రాంతాల్లో మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భారీగా క్వార్ట్జ్ నిల్వలను సీజ్ చేశారు. మొగళ్లూరులోని సర్వే నెం.286లో 13,677 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను తవ్వేసినట్లు గుర్తించారు. అప్పటికే అక్రమార్కులు తరలించగా మిగిలిన 4,001 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరుపూరులోని సర్వే నెం.583, 584, 585లలో 4020 మెట్రిక్ టన్నుల తవ్వకాలు జరిపినట్లు నిర్ధారించారు. ఆ ప్రాంతంలో విక్రయాలకు సిద్ధంగా ఉంచిన 2,990 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను సీజ్ చేశారు. ఈ విషయమై మైనింగ్ అధికారులు పొదలకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైనింగ్ చట్ట ప్రకారం పోలీసులు కేసులు కట్టారు. అయితే ఇవన్నీ ప్రభుత్వ భూములే. మరి ప్రభుత్వ భూముల్లో ఇంత బహిరంగంగా తవ్వకాలు జరిపి, ప్రజా ధనాన్ని దోచుకెళుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతి గ్రామంలో సచివాలయం ఉంది. అక్కడ ఓ వీఆర్వో ఉన్నారు. వారికి ఆ గ్రామంలో ఏం జరుగుతుందో తెలిసిపోతుంది. కానీ వారు ఎవరూ కూడా అక్రమ మైనింగ్‌ను అడ్డుకోలేదు. పోనీ మైనింగ్ అధికారులు ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు జరిగాయని నిర్ధారించిన తర్వాత కూడా రెవెన్యూ శాఖ స్పందించలేదు. తమ భూముల్లో రూ.వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను తవ్వేస్తే కనీసం వారు కేసులు కూడా పెట్టలేదు. ఇక మైనింగ్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసులు కట్టిన పోలీసులు వారం గడిచినా ఇంతవరకు ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదు. ఫిర్యాదుల్లోనే కొంతమంది పేర్లను అధికారులు పేర్కొన్నారు. తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో నుంచి వాహనాలు వెళ్లిన మార్గాల్లో సీసీ కెమెరాలు పరిశీలిస్తే ఏయే వాహనాలు క్వార్ట్జ్ లోడ్‌లతో వెళ్లాయో తెలిసిపోతుంది. మరి ఆ దిశగా విచారణ సాగుతున్నట్లు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పొదలకూరు మండలం మరుపూరులో అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు (ఫైల్)

● కేంద్రం ఆదేశాలతో కదలిక

పొదలకూరు మండలం వరదాపురం సమీపంలోని రుస్తుం, భారత్ మైన్లలో తవ్వకాలపై హైకోర్టు స్టే ఇచ్చినా లెక్కచేయకుండా క్వార్ట్జ్‌ను అక్రమంగా తరలించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తినా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించలేదు. దీంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీలకు టీడీపీ నేత సోమిరెడ్డి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. స్పందించిన కేంద్ర గనుల శాఖ.. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జరుగుతున్న క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫలితంగా కదిలిన రాష్ట్ర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ శాఖల అధికారులు క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై నివేదికలు తయారు చేస్తున్నట్లు సమాచారం. జీపీఎస్ ఫొటోలు, జీపీఎస్ వీడియోలను జత చేస్తూ సోమిరెడ్డి ఫిర్యాదు చేయడంతో అధికారులు ఇరుక్కుపోయారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు నిజమేనని నివేదిక ఇస్తే నాడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తారని, ఒకవేళ అక్రమ తవ్వకాలు జరగలేదని తప్పుడు నివేదిక ఇస్తే అది కూడా తమ మెడకే చుట్టుకుంటుందని అధికార వర్గాలు వాపోతున్నాయి.

తనిఖీలు కొనసాగిస్తాం..

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై దృష్టి పెట్టాం. ఇప్పటికే పలు చోట్ల తవ్వకాలను గుర్తించి సరుకును సీజ్ చేశాం. పోలీసు కేసులు కూడా నమోదు చేశాం. ఇంకొందరికి నోటీసులు ఇచ్చి జరిమానాలు వసూలు చేస్తున్నాం. అక్రమ తవ్వకాలపై తనిఖీలు కొనసాగిస్తాం.

- శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ

నిర్వహణకు నోచుకోని బస్‌షెల్టర్లు!

- పరిశుభ్రతకు నోచుకోక లక్షలు వెచ్చించిన నిర్మాణాలు వృథా
- చెట్ల కింద సేదతీరుతున్న ప్రయాణికులు


తాతిరెడ్డిపాలెంకు వెళ్లే దారిలోని బస్‌షెల్టర్


చెట్టు నీడన సేద తీరుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు, మార్చి 25: నియోజకవర్గంలోని అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, మర్రిపాడు, ఆత్మకూరు, సంగం మండలాల్లోని గ్రామాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణకు నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్లను పట్టించుకునే వారే కరువయ్యారు. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన నిర్మాణాలు వృథాగా మారుతున్నాయి. ఈ సమస్యతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు నిలువనీడ లేక చెట్ల కింద వేచిచూడాల్సిన పరిస్థితి నెలకుంది. ఆత్మకూరు మండలంలోని నువ్వూరుపాడు, అశ్వినీపురం, జంగాలపల్లి, దేపూరు గ్రామాల్లో రోడ్డు పక్కనే నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణ కొరవడి ప్రయాణికులు కూర్చునేందుకు అనువుగా లేక అధ్వానంగా ఉన్నాయి. ఏఎస్‌పేట మండలంలో తాతిరెడ్డిపాళెం, పొనుగోడు, చౌటభీమవరం గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి నుంచి ప్రయాణికులకు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం నుంచి రాకపోకలు సాగించిన ప్రయాణికులు సేదతీరేందుకు ఉన్న బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారడంతో చెట్ల నీడన సేద తీరుతున్నారు. అనంతసాగరం, చేజర్ల మండలాల్లో పరిస్థితి అలాగే ఉన్నది.

పట్టించుకోని అధికారులు

వీటి నిర్వహణను ఆర్టీసీ, గ్రామ పంచాయతీ అధికారులు గాలికి వదిలేశారు. శుభ్రం చేసేవారు లేకపోవడంతో చెత్తాచెదారంతో నిండి పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుంటాయి. ప్రయాణికులు బస్‌షెల్టర్ ప్రాంగణంలో నిలుచోలేకపోతున్నారు. ఎక్కడా మూత్రశాలలు లేవు. కనీసం తాగునీటి సౌకర్యం, విద్యుత్‌దీపాలు లేవు. రాత్రియ్యిందంటే బస్‌షెల్టర్ల పరిసరాల్లో అంధకారం అలుముకుంటోంది. ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యమని చెప్పే ఆర్టీసీ అధికారులు, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే పంచాయతీ అధికారులు బస్‌షెల్టర్ల అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

హోలీ.. రంగోళీ !


సంగం: రంగులు పూసుకుని నీళ్లు చల్లుకుంటున్న చిన్నారులు



సీతారామపురం, మార్చి 25: సీతారామపురంలో చిన్నపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

ఉదయగిరి: గడ్డంవారిపల్లి, ఉదయగిరి, అప్పసముద్రం, పుల్లాయపల్లి, జీ.చెరువుపల్లి, చెర్లోపల్లి, అయ్యవారిపల్లి, కొండాయపాళెం గ్రామాల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరినొకరు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. మరికొన్ని చోట్ల యువకులు డీజేలు ఏర్పాటు చేసి పండుగను ఆనందోత్స వాలతో జరుపుకున్నారు.

సంగం: మండలకేంద్రంలో చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకుని ఆట పాటలతో నీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. రోజంతా సందడి చేశారు.


కోటవీధిలో చిన్నారుల సంబరాలు


ఉదయగిరిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

యువత రాజకీయాల్లోకి రావాలి

ఉదయగిరి రూరల్, మార్చి 25: ప్రస్తుత పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివేకానంద యూత్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆవుల భూపతిరాజ తెలిపారు. సోమవారం స్థానిక శివాలయంలో యువకులతో కలిసి హోలీ వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల సామాజిక వెనుకబాటుతనం, పొట్టకూటి కోసం వలసబాట పడుతున్న ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వివేకానంద యూత్ ముందుకు వస్తుందన్నారు. రాజకీయాల్లోకి వచ్చే యువతకు తమ అండదండలు ఉంటాయన్నారు. అందులో భాగంగా జరనున్న సార్వత్రిక ఎన్నికల్లో యూత్ ఆధ్వర్యంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. యువకులకు శిక్షణ శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. లీగల్ సెల్ సభ్యులు నంబూరు సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ముస్లింలకు తోఫా అందజేత


సరుకులు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

అనంతసాగరం, మార్చి 25: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలోని ముస్లిం కుటుంబాలకు సోమవారం వైఎస్సార్ ఫౌండేషన్ నిర్వాహకులు అక్కులరెడ్డి బాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డిలు రంజాన్ తోఫా అంద జేశారు. బియ్యం, చక్కెర, గోధుమపిండి, సేమియాలు, పప్పులు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వారి వెంట అక్కులరెడ్డి రమణారెడ్డి, పెద్దనారాయణరెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, బి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మన ఫౌండేషన్ అధినేత ఔదార్యం


నగదును అందజేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి, మార్చి 25: స్థానిక బీసీ కాలనీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న షేక్ మహబూబ్‌బాషాకు సోమవారం మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సొంత నిధులతో ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీటిని అందిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలనీ వాసులకు శ్మశానం, రోడ్డు, కల్యాణ మండపం నిర్మించేం దుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నిసార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్: కృష్ణంపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఆమె కోరారు.

నిరుపయోగంగా సోమశిల ఉప కాలువలు

ఆత్మకూరు, మార్చి 25: సోమశిల జలాలు చెంతనే ఉన్నా సాగునీటికి నోచుకోక ఆ గ్రామ రైతులు దశాబ్ధకాలంగా భూములను బీడులుగానే పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సాగునీరు అందించేందుకు లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన ఉపకాలువలు నిరుపయోగంగా మారాయి. మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయి. అందుకు సోమశిల 12ఆర్ ఉపకాలువే ప్రత్యక్ష నిదర్శనం. నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడుకి చెందిన 175ఎకరాలకు సాగునీరు అందించేందుకు సోమశిల ఉత్తరకాలువ నుంచి 18ఏళ్ల కిందట 12ఆర్ ఉపకాలువ పనులు, కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిన దాఖలాలు లేవు. పదేళ్ల క్రితం కామిరెడ్డిపాడుకు విచ్చేసిన అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి 12ఆర్ ఉపకాలువ మరమ్మతుల విషయం తీసుకెళ్లారు. ఆయన నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో కొంత మేర పనులు జరగడంతో 20ఎకరాలకు పైబడి మాత్రమే సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయకట్టు చివరి వరకు (150 ఎకరాలు) సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు.

ఆనం సమక్షంలో టీడీపీలోకి చేరిక


ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మర్రిపాడు,: పెగళ్లపాడుకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరారు. పార్టీ మాజీ మండలాధ్యక్షులు శాఖమూరి నారాయణ, శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరులోని మాజీ మంత్రి ఆనం రామనారాయ రెడ్డి నివాసంలో పార్టీలో చేరారు. వారికి ఆనం రామనారా యణరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేపు ధ్రువపత్రాల పంపిణీ

ఉదయగిరి రూరల్, మార్చి 25: పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (న్యాక్) ద్వారా పీఎం విశ్వకర్మ పథకంలో గత రెండు నెలల క్రితం తాపీమేస్త్రీలుగా ఆరురోజులు శిక్షణ పొందిన వారికి బుధవారం న్యాక్ కార్యాలయంలో ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్లు సోమవారం కేంద్రం నిర్వాహకులు లక్కినేని ప్రకాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారు తప్పనిసరిగా హాజరై ధ్రువపత్రాలు తీసుకెళ్లాలని కోరారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

సంగం, మార్చి 25: కొత్తూరులోని బాలచౌడేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం సత్యనారాయణవ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్డీఏ కూటమికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మద్దతు

వింజమూరు, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ఉండవల్లిలో ఆదివారం తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగతో కలిసి జరిపిన చర్చలు సఫలం అయినట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేడర్‌మాదిగ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలని మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత, మాదిగల సంక్షేమానికి ప్రభుత్వరంగ సంస్థలల్లోగా వాటా ఇవ్వాలని వారు డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

వరికుంటపాడు: ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కావలి డీఎస్పీ వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం జిల్లా సరిహద్దు ప్రాంతమైన భోగ్యంవారిపల్లి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి సమాచారాన్ని అందజేయాలన్నారు. మద్యం, నగదు తరలించే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట సీఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..!

- నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్


ఉదయగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, మార్చి 25: ప్రజాసేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం స్థానిక శోభ కాంప్లెక్స్‌లో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు ఆధ్వర్యంలో బీజేపీ మండలాధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామినాయుడు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి గ్రామమన్నారు. తమ కుటుంబం ట్రస్టు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో రెండేళ్లుగా పేదలకు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అన్నిరంగాల్లో వెనుకబడిన నియోజకవర్గాన్ని చూసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బుపై తనకు వ్యామోహం లేదన్నారు. నియోజకవర్గంలో సమస్యలపై తనకు అవగాహన ఉందని, తాగు, సాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు ప్రధానంగా పరిశ్రమలు నెలకొల్పి వలస నివారణకు చర్యలు చేపడతానన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కాకర్ల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, సీహెచ్ బయ్యన్న, గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, మూలె బాలకృష్ణారెడ్డి, మేకపాటి మాల్యాద్రినాయుడు, ఆంద్రా పరంధామిరెడ్డి, పులిచర్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా నేనుంటానని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని పోకలవారిపల్లిలోని టీడీపీ నాయకులు చింతల శ్రీనివాసులు స్వగృహంలో ఉదయగిరి అధ్యక్షతన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అందరి సహకారంతో అఖండ విజయం సాధించి ఉదయగిరికోటపై తెలుగుదేశం జెండా ఎగరవేస్తామన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న కోదండరామాలయ సంప్రోక్షణ కార్యక్రమాలు సోమవారం జరిగాయి. జీవ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పశుపోషణ భారం!

- వెంటాడుతున్న వరి గడ్డి కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.30 వేలు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఆందోళనలో పాడి రైతులు


కొనుగోలు చేసి తెచ్చుకున్న వరి గడ్డి

వలేటివారిపాలెం, మార్చి 25 : ప్రభుత్వ ప్రోత్సాహం కరువడంతో పశు పోషణ భారంగా మారింది. గ్రామాల్లో వ్యవసాయం తరువాత అధిక శాతం మంది పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయంలో పాడి పరిశ్రమకు ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలు ఇప్పుడు ఇవ్వకపోవడం, ట్రాక్టర్ వరిగడ్డి అన్ని ఖర్చులతో కలిపి ఇంటికి చేరేటప్పటికీ రూ.30 వేలు అవుతుండడంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అధికారిక లెక్కల ప్రకారం 14,893 గేదెలు, 460 గోవులు, 25,736 గొర్రెలు, 7063 మేకలు ఉన్నాయి. వీటి పోషణ, భద్రతకు గత టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలు, ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస క్షేత్రాల విస్తరణ, రాయితీపై పాతర గడ్డి సరఫరా, దాణా మృతం పంపిణీ తదితర పథకాలు అమలు చేసింది. ఈ పథకాలకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడి అటకెక్కించింది. దీంతో పశు పోషకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై వలేటివారిపాలెం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు బ్రహ్మయ్య మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పశుగ్రాసం కొరత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.


కందుకూరు : వాసవీకాలనీలో హోలీ వేడుకల్లో చిన్నారులు

కందుకూరు, మార్చి 25: హోలీ పర్వదినాన్ని పట్టణంలో సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారుల రంగుల కేళీ హోలీ అంటూ గులాంలు, రంగునీళ్లు చల్లుకున్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం బాస్కరరావు ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవీనగర్, పెద్దబజారుల్లో ఆర్యవైశ్య మహిళలు, చిన్నారులు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు

వలేటివారిపాలెం : మండలంలో హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఒకరిపై మరొకరు రంగులు చల్లుకున్నారు. రంగుల కేళీ, రంగేలీ హోలీ అంటూ ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.

కలిగిరి : మండలంలో హోలీ వేడుకలను మహిళలు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు కావడంతో విద్యార్థులు, యువకులు రంగులు చల్లుకుం టూ కేరింతలు కొడుతూ వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు.


కలిగిరి : హోలీ సంబరాల్లో చిన్నారులు

అంకమ్మ ఆలయంలో ఇంటూరి పూజలు


అంకమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఇంటూరి

లింగసముద్రం, మార్చి 25 : లింగసముద్రంలోని అంకమ్మ ఆలయంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అర్ధాకుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన అంకమ్మ తిరునాళ్లకు హాజరైన ఆయనకు మాజీ ఎంపీటీసీ అర్ధాకుల దుర్గాభవాని, అర్ధాకుల వెంకటేశ్వరరావులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, అడపా రంగయ్య, మద్దెల రామారావు, గాలంకి ప్రసాద్, జంపాల శివప్రసాద్, సీహెచ్ బాలకోటయ్య, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, ఏ.చిన సత్యం, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా ఆర్యవైశ్య పరిచయ వేదిక విజయవంతం

కావలి, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన పరిచయ వేదికను భగ్నం చేసేందుకు అధికారపార్టీ నేతలు ఎన్ని కుట్రలు, పన్నాగాలు పన్నినా పరిచయ వేదిక విజయవంతమైందని ఆర్యవైశ్య నేతలు తెలిపారు. కావలిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీలోని ఆర్యవైశ్య ముఖ్యనేతలు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల పరిచయ వేదికను భగ్నం చేసేందుకు అధికారపార్టీకి చెందిన నేతలు కొందరి ఆర్యవైశ్యులకు ఫోన్‌లు చేసి బెదిరించారన్నారు. కార్యక్రమం నిర్వహించే కల్యాణ మండపం వద్దకు ముందు రోజున అధికారులను పంపించి దానికి అనుమతులు ఉన్నాయా లేవా అని తనిఖీ చేయించారన్నారు. కార్యక్రమం జరిగే సమయంలో కూడా పోలీసులను పంపి సమయం అయిపోయిందని అక్కడ నుంచి బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. ఎన్నికుతంత్రాలు, కుట్రలు పన్నినా ఆర్యవైశ్యులు ఈ సమావేశానికి వచ్చి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు తిరువీధి ప్రసాద్, చవల రామకృష్ణ, పోతుగంటి శ్రీకాంత్, తటవర్తి రమేష్, తటవర్తి వాసు, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, మార్చి 25: తెలుగుదేశం ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేశారని, రానున్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు అమలుచేసేందుకు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య పేర్కొన్నారు. పట్టణంలోని 6వ వార్డులో సోమవారం ఆమె స్థానిక మహిళలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ అహ్మద్‌బాషా, తహరాబేగం, షాహిదా, మహబ్బానీ, శంషాద్, రూబీ, ఫిరోజ్, బాబు, దావూద్ సలీం, మియా, గౌస్, సమద్, హుస్సేన్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

చివరిసారి పోటీలో ఉండాలనుకుంటున్నా!

- విజయసాయిరెడ్డితో మాజీ ఎమ్మెల్యే విష్ణు

అల్లూరు, మార్చి 25 : తాను చివరిసారిగా పోటీ చేయాలని అనుకుంటున్నానని, ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నానని తనను కలసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. సోమవారం విజయసాయిరెడ్డి అల్లూరులోని విష్ణు నివాసానికి చేరుకుని సుమారు గంటపాటు ఆయనతో భేటీ అయ్యారు. ఆయనను వైసీపీలో చేరాలని కోరారు. దీంతో తాను పోటీలో ఉంటానని చెబుతూ అయినప్పటికీ తన అనుచరులతో సమావేశమై అందరి అభిప్రాయాలను తీసుకొని తుది నిర్ణయాన్ని తెలుపుతానని విష్ణు చెప్పారు. ఆయన అనుచరులు విజయసాయిరెడ్డితో మాట్లాడుతూ తమ నాయకుడికి ఒక్క అవకాశం ఇచ్చి పోటీలో ఉండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ వైసీపీకి మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అవసరం ఉండడంతో పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అన్ని విషయాలు క్షుణ్ణంగా చర్చించామని, జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి మరోసారి భేటీ అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, గోస గోపాల్‌రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, మోహన్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో యువకుడి ఆత్మహత్య

వనస్థలిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పందలపాడు గ్రామానికి చెందిన వర్ల కిరణ్‌కుమార్(26) హస్తినాపురంలోని సాహితీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ మయూరి కమ్యునికేషన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చిన కిరణ్‌కుమార్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. సోమవారం ఉదయం వరకు తలుపు తెరవకపోవడం, పక్క రూమువాళ్లు తలుపు కొట్టినా తీయకపోవడంతో హాస్టల్ నిర్వాహకులు వెంటిలేటర్ నుంచి చూడగా, ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. హాస్టల్ నిర్వాహకుడు పోలీసులకు సమాచారమందించడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కిరణ్ తల్లిదండ్రులకు సమాచారమందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

'ప్రకాశం'లో ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

కందుకూరు, మార్చి 25: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ (అటానమస్) ఫస్ట్ ఇయర్ తొలి సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. అన్ని బ్రాంచిలలలో 42.47 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా సీఎస్‌ఈలో అత్యధికంగా 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్‌లు అధ్యాపకులను అభినందించారు.

రూ.1.55 లక్షల పట్టివేత

వలేటివారిపాలెం, మార్చి 25 : మండలంలోని మాలకొండ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం అర్ధరాతి 11 గంటల సమయంలో కారులో వస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.1.55 లక్షల ఫ్లయింగ్ స్కాడ్ టీం, వలేటివారిపాలెం పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసే క్రమంలో కడప జిల్లా రాజంపేట నుంచి వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిచెరువుకు ఒక వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో నగదు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ నగదును ట్రెజరీలో జమ చేసినట్లు ఫ్లయింగ్ స్కాడ్ టీం పోలీసులు తెలిపారు.

వైసీపీ రంగులపై సున్నం


ప్రహరీ, దిమ్మెలకు వేసిన తెల్ల సున్నం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి, మార్చి 25: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా కావలి పట్టణం ముసునూరు మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ట్రంకు రోడ్డు వెంబడి ఒక ఇంటి ప్రహరీకి, దాని ముందున్న జెండా దిమ్మెకు వైసీపీ రంగులు వేసి ఉండగా శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆ ఇంటి ప్రహరీకి, దిమ్మెకు ఉన్న వైసీపీ రంగులను చెరిపేసి వాటిపై సున్నం వేయించారు.

ప్రజాసత్తా, ముస్లిం సత్తా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రేష్మ

కావలిటౌన్, మార్చి 25: ప్రజాసత్తా, ముస్లిం మైనారిటీ సంక్షేమ అనుబంధ విభాగం ముస్లిం సత్తా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కావలికి చెందిన ఎస్‌కె రేష్మ ఎంపికయ్యారు. ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శోభన్‌బాబు సోమవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు నియామక పత్రం అందించారు.

ఆనెమడుగు వాసులు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన ఆనెమడుగు వాసులు

కావలి, మార్చి 25: కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ ప్రజలు సీనియర్ నేత ఉప్పాల యల్లారావు ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సోదరులు మాల్యాద్రిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, పరిశీలకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయంలో 'ఆరోగ్య సురక్ష'

వలేటివారిపాలెం, మార్చి 25 : మండలంలోని నేకునాంపురం గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని శింగమనేనిపల్లె, నేకునాంపురం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు

కావలిటౌన్, మార్చి 25: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరిగిన ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన వారోత్సవాల్లో చివరి రోజు మొక్కలు నాటి పచ్చదనం యొక్క ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ, విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్ రెడ్డిలు ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు